మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 68 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad





# దశాబ్ది ఉత్సవాలపై ముమ్మర కసరత్తు

**- తెలంగాణ గీతం, రాజముద్రపై చర్చలు**

**- సిఎం రేవంత్ నివాసంలో భట్టి తదితరుల సమాలోచన**

**హైదరాబాద్,మే29:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు దగ్గర పడుతున్న వేళ ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. అలాగే ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా సోనియాను సిఎం రేవంత్ ఆహ్వానించారు. మరోవైపు ముద్రను మార్చాలన్న నిర్ణయంతో పాటు, జజాతీయ గీతం కూడా రూపుదిద్దు కుంటోంది. ఈ క్రమంలో పనులు వేగవంతం చేశారు. తెలంగాణ గీతం, రాజముద్ర ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో.. ముఖ్యమంత్రి నివాసానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. తెలంగాణా గీతం, తెలంగాణ లోగో ఎంపిక పై వారిద్దరూ చర్చించారు. . మరోవైపు.. తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో.. గీతం రూపకల్పనపై కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణితో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష చేపట్టారు. సాయంత్రం వరకు పాటకు సంబంధించి పూర్తిస్థాయిలో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు.. తెలంగాణ రాజముద్రకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లోగో, గీతాన్ని ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయనుంది. రాజముద్రకు సంబంధించి గతంలో ఉన్న రంగులే ఉండనున్నాయి. కాకపోతే.. గతంలో ఉన్న రాజముద్రకు సంబంధించి అందులో రాచరిక పోకడలు ఉన్నాయని.. తెలంగాణ అనేది ఉద్యమం, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను పొందుపరిచేలా రాజముద్ర ఉంటే బాగుటుందనే ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. అందుకు అనుగుణంగా చిహ్నాలను పొందుపరిచే అవకాశం ఉంది. కాగా.. రాష్ట్ర గీతాన్ని రూపొందించేందుకు అందెశ్రీకి బాధ్యతలు అప్పగించగా.. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణితో కలిసి జయ జయహే తెలంగాణ పాటను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రు నాయక్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, హాజరయ్యారు.



# వికసిత బెంగాల్ కూడా ముఖ్యమే

- బెంగాల్లో బిజెపి అనూహ్యస్పందన లభిస్తోంది
- మళ్లీ కేంద్రంలో మోడీ ప్రభుత్వమే వస్తోంది
- చివరి ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ వెల్లడి

**కోల్‌కతా,మే29:** పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా ఈసారి కనీవినీ ఎరుగనంతగా బీజేపీకి ప్రజల మద్దతు కనిపిస్తోందని, ప్రజల ఆదరణ అనూహ్యంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మరోసారి మోదీ సర్కార్ వస్తుంది' అనే స్పష్టమైన సందేశాన్ని ప్రజలు ఇచ్చారని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని మధురాపూర్ బుధవారంనాడు జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, కోల్‌కతాలో జరిపిన రోడ్‌షోలో ప్రజలు చూపిన ఆదరణ ఎన్నటికీ మరిచిపోనని చెప్పారు. "2024 ఎన్నికల్లో కోల్‌కతాలో మీతో పాల్గొంటున్న చివరి సమావేశం ఇది. ఇక్కడి నుంచి ఒడిశా, పంజాబ్ వెళుతున్నాను. గురువారం సాయంత్రంతో ప్రచారం ముగుస్తుంది. ఇవాళ మీ నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే మీ ఆశీస్సులు నావెంటే ఉన్నాయని బలంగా నమ్ముతున్నాను' అని ప్రజలను ఉద్దేశించి మోదీ అన్నారు. 'వికసిత్ భారత్' దిశగా ఇండియా పయనం సాగిస్తోందని, అందుకోసం వికసిత్ బెంగాల్ చాలా కీలకమని చెప్పారు. ఇది సాధ్యం కావాలంటే ఇదే విజన్ ఉన్న ఎంపీలను గెలిపించుకోవాలని, తద్వారా తమకు ఆశీస్సులు అందించాలని ప్రధాని కోరారు. బుజ్జగింపు రాజకీయాల కోసం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై దాడి చేస్తోందని ప్రధాని మండిపడ్డారు. ఓబీసీల హక్కులను ఊడలాక్కుని ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలను కుంటోందన్నారు. ఓబీసీ సర్టిఫికెట్లను కోల్‌కతా కోర్టు రద్దు చేసిందని, జూన్ 1న వికసిత్ బెంగాల్‌కు ప్రజల ఓట్లే కీలకమని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఉద్దేశించిన అవకాశాలను చొరబాటుదారుల పరం కానున్నాయని మోదీ హెచ్చరించారు. సీఏఏను టీఎంసీ ఎందుకు టీఎంసీ వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. చొరబాటుదారులకు ఇక్కడ సుస్థిరస్థానం కల్పించాలనే ఆలోచనే ఇందుకు కారణమని మోదీ వివరించారు.

# యూపిలో 75 ఎంపి స్థానాలు గెలువబోతున్నాం

**- మోడీ లాంటి నాయకుడే దేశానికి రక్ష**

**- ఫలితాల తరవాత ఇవిఎంలపై దుమ్మెత్తి పోయడం ఖాయం**

**- యూపి ప్రచారంలో అమిత్ షా ఘాటు విమర్శలు**



**లక్నో,మే29:** ఈ లోక్‌సభ ఎన్నికలు అయోధ్య రామభక్తులకు, వారిపై తూటాలకు దింపిన వారికి మధ్య పోటీగా మారాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారదశల్లో అత్యంత జాగ్రత్తగా మాట్లాడాలని ఎన్నికల సంఘం హెచ్చరికలు వెలువరించిన తరువాత హోం మంత్రి ఉత్తరప్రదేశ్‌లో బుధవారం నాటి ఎన్నికల సభలలో ఘాటుగా మాట్లాడారు. ఇవి మామూలు ఎన్నికలు కావని, అయోధ్యలో రామాలయనిర్మాణానికి పాటుపడ్డ వారు ఒక వైపు, వారిపై కాల్పులకు ప్రేరేపించిన వారొక్కరు బరిలో నిలిచారని చెప్పారు. డియోరియాలో బిజెపి అభ్యర్థి శశాంత్ మణి త్రిపాఠీ విజయానికి అమిత్ షా బిజెపి తరఫున ప్రచారం సాగించారు. విపక్షాలు అయోధ్యలో రామాలయ నిర్మాణానికి 70 ఏండ్ల పాటు అడ్డుగా మారారని తెలిపారు. ప్రధాని మోడీ ప్రమేయంతోనే అయోధ్యలో రామాలయం ఉనికిలోకి వచ్చిందన్నారు. 1990లో ములాయం సింగ్ యాదవ్ సిఎంగా ఉన్నప్పుడు కరసేవకులపై కాల్పుల విషయాన్ని ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించిన అమిత్ షా సమాజ్‌వాది పార్టీ ప్రమాదకరమైనదని తెలిపారు. కాంగ్రెస్‌కు , సమాజ్‌వాది పార్టీ నేతలకు వారిపై వారికే నమ్మకం లేదని , ఎన్నికలలో ఓటమి పాలయినప్పుడల్లా వారు ఇవిఎంలపై నిందలు మోపడం జరుగుతుందని విమర్శించారు. ఇప్పుడు జూన్ 4వ తేదీన కూడా ఇదే జరుగుందన్నారు. ఆ రోజు ఇద్దరు యువరాజులు రాహుల్, అఖిలేష్ యాదవ్ కూడబలుక్కుని విలేకరుల సమావేశం పెడుతారు. తమ ఓటమికి కారణం ఎవిఎంలే అని మరోసారి నిందిస్తారని...

మిగతా 2లో..

# కేరళలోకి నైరుతి ఆగమనం


**నాలుగైదు రోజుల్లో తెలుగు రాష్ట్రాలకు విస్తరణ**



**న్యూఢిల్లీమే29:** ఈశాన్య రాష్ట్రాల్లో రెమాల్ తుపాను బీభత్సం సృష్టించగాఉత్తరాది రాష్ట్రాలను మండుటెండలు వణికిస్తున్నాయి. ఇటు తెలుగు రాష్ట్రాల్లోనూ మళ్లీ ఎండలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో భారత వాతావరణ శాఖ చల్లటి వార్త చెప్పింది. మరికొద్దిగంటల్లోనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయని వెల్లడించింది. అంచనా వేసిన సమయానికంటే ముందే నైరుతి వస్తుండటంతో ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేరళను నైరుతి తాకిన నాలుగైదు రోజుల్లోనే ఏపీ, తెలంగాణకు కూడా విస్తరిస్తా యని వాతావరణ నిపుణులు వెల్లడించారు. నైరుతి రాకతో అగ్నిగోళంలా మండుతున్న రాష్ట్రాలు చల్లబడనున్నాయి. నైరుతి రుతుపవన కాలంలో వర్షాలు దంచికొట్టనున్నాయని పేర్కొన్నారు. గతేడాది రుతుపవనాలు అంచనా వేసిన సమయానికంటే ఆలస్యంగా వచ్చాయని, ఇప్పుడు మాత్రం రుతుపవనాల వ్యాప్తికి వాతావరణం అనుకూలంగా ఉందని చెప్పారు. కాగా.. ఉపరితల ద్రోణి, అల్పపీడనం ప్రభావంతో వారంరోజులుగా అక్కడక్కడా అడపాదడపా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇప్పుడు అంచనా వేసిన సమయానికి రుతుపవనాలు తీరాన్ని తాకి వర్షాలు పడితే.. వ్యవసాయ పనులను కూడా ప్రారంభించవచ్చని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

# సుమారు 1200 మంది ఫోన్ల ట్యాప్

- ప్రధానంగా ప్తరిపక్ష నేతలపైనే దృష్టి
- నేతల, జడ్జిలు, స్థిరాస్థి వ్యాపారుల పోన్ల ట్యాప్
- వాంగ్మూలంలో పేర్కొన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు



**హైదరాబాద్,మే29:** సుమారు 1200 మంది ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అంగీకరిం చారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఆయన వాంగ్మూలంలో పేర్కొన్న కీలక విషయాలు బయటకు వచ్చాయి. ప్రధానంగా ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టామని, వారికి వెళ్లే డబ్బును అడ్డగించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నేతలు, జడ్జిలు, స్థిరాస్తి వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు అంగీకరించారు. కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్ సాయంతో ట్యాపింగ్‌కు పాల్పడినట్టు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ పర్యవేక్షణ కోసం 17 కంప్యూటర్లను వినియోగిం చామని, 56 మంది ఎస్‌వోటీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ట్యాపింగ్

మిగతా 2లో..

## బిజెపిని ఓడించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు

- మోడీ కొనసాగితే రష్యాలో పుతిన్ లాగే నియంతృత్వం
- ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం
- మీడియా ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ వ్యాఖ్యలు

మిగతా 2లో..



## ఢిల్లీలో భానుడి ఉగ్రరూపం

ముంగేష్‌పూర్‌లో

52.3 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు

మిగతా 2లో..



# దేశ సంపద ఆ బిలియనీర్ల చేతుల్లోనే

**- కోటీశ్వరులను బలోపేతం చేయడమమే బీజేపీ లక్ష్యం**

**- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ**

**కులు,మే29:** ప్రధాని మోదీ తన పాలనలో ఉపాధి కల్పనను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఆమె ప్రసంగించారు. విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చిన్న తరహా పరిశ్రమలను పోత్సహిస్తామని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమల రంగంలో ఉద్యోగాలను కల్పిస్తామని అన్నారు. ప్రధాని మోదీ తన పాలనలో ఉపాధి కల్పనను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. బీజేపీ విధానాలను మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ విధానాలకు చిన్న పరిశ్రమలు చితికిపోయేలా ఉన్నాయని తెలిపారు. కాషాయ పాలకుల విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం అవుతుంటే..మరో వైపు బిలియనీర్లు సంపద పోగేసుకుంటున్నారని దుయ్యబట్టారు. చిన్న, మధ్యతరగతి వ్యాపారాలను బలోపేతం చేయాలని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తే వాటి ద్వారా చాలా మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. కోటీశ్వరులను బలోపేతం చేయడమమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని విమర్శించారు. దేశంలోని సంపద అంతా బిలియనీర్లకు నెమ్మదిగా అందజేస్తున్నారని ఆరోపించారు.



మోదీ పాలనలో ఉపాధి కల్పన పనులు నిలిచిపోయాయని విమర్శించారు. గత 45 ఏళ్లలో అత్యధిక నిరుద్యోగాన్ని దేశం ఎదుర్కొంటోంది తెలిపారు. దేశ వ్యాప్తంగా మొత్తం కోట్ల మంది యువత నిరుద్యోగులుగా ఉన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల పర్యాటక రంగానికి నష్టం వాటిల్లిందని ప్రియాంక గాంధీ అన్నారు.

# ప్లాస్టిక్ రహిత జోన్‌గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్

**ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా మార్చేందుకు కార్యాచరణ**

**అధికారులతో సీమక్షలో సిఎస్ శాంతికుమారి ఆదేశాలు**



2లో..

# యూపిలో 75 ఎంపి స్థానాలు

మొదటి పేజీ తరువాయి



ఆ రోజు జరిగేది ఇదే అని అంతకు ముందు మహారాజ్‌గంజ్‌లో పార్టీ అభ్యర్థి పంకజ్ చౌదరి విజయానికి జరిగిన సభలో చమత్కరించారు. ప్రతిపక్షాలకు ప్రధాని అభ్యర్థి లేరని, వారికి ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులు ఉంటారని వ్యాఖ్యానించారు. ఇదేమన్నా కిరాణాకొట్టా? 130 కోట్ల మందితో కూడిన దేశం, బహుళ ప్రధానుల పద్ధతి చెల్లనేరుతుందా? వారి పరాజయం తప్పదు, ఇవిఎంలపై నిందలూ తప్పవని స్పష్టం చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో 70 లోక్‌సభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. 2014 నాటి ఎన్నికల రికార్డును తమ పార్టీ బద్దలు కొడతుందని తెలిపారు. ఈ సారి ప్రధాని మోదీని అనుకూల పవనాలు చాలా బలంగా వీస్తున్నాయన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లో మీడియాకు ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడారు. యూపీలో శాంతి భద్రతలు చాలా బాగున్నాయంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. గతంలో యూపీలో అఖిల్ యాదవ్ ప్రభుత్వ హయాంలో ఉన్న పరిస్థితులు, ప్రస్తుతం యోగి ఆదిత్యనాథ్ హయాంలో ఉన్న పరిస్థితులను ఈ సందర్భంగా అమిత్ షా సోదాహరణగా వివరించారు. 1960 అనంతరం.. మళ్లీ రాష్ట్రంలో శాంతి భద్రతలతోపాటు పరిస్థితులు బాగున్నాయని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఇక బుందేల్ ఖండ్ ప్రాంత వాసుల కోసం మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు తీసుకు వచ్చిందని వివరించారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన అనేక సంక్షేమ పథకాల వల్ల రాష్ట్ర ప్రజలు లబ్ధి పొందారని గుర్తు చేశారు. ఆ క్రమంలో వారంతా మోదీకి బాసటగా నిలుస్తారని చెప్పారు. త ఎన్నికల వేళ రాష్ట్రంలో బీఎస్పీ, ఎస్పీ, ఆర్ఎల్‌డీ, కాంగ్రెస్ పార్టీలకు 43 శాతమే ఓట్ షేర్ ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు పూర్తిగా మారాయని తెలిపారు. నేడు కాంగ్రెస్, ఎస్పీ ఓట్ షేర్ 26 శాతమే ఉందన్నారు. ఇప్పటి వరకు జరిగిన 5 దశల పోలింగ్‌తో బీజేపీకి 310 స్థానాలు వస్తాయని అమిత్ షా జోస్యం చెప్పారు. ఇక ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ పార్టీ 40 స్థానాలు కూడా గెలుచుకోలేదని.. అలాగే అఖిలేష్ యాదవ్ సారథ్యంలోని సమాజవాదీ పార్టీ 4 స్థానాలు గెలుచుకుంటుందని అమిత్ షా వ్యంగ్యంగా అన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే.. రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ ప్రెస్‌మీట్ పెట్టి.. తమ ఓటమికి ఈవీఎంలే కారణమంటూ పేర్కొంటారని అమిత్ షా ఎద్దేవా చేశారు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్న సంగతి తెలిసిందే.

# సుమారు 1200 మంది

మొదటి పేజీ తరువాయి




ఆపేయాలని ప్రభాకర్‌రావు నుంచి ఆదేశాలు అందినట్లు చెప్పారు. ఆయన రాజీనామా చేసే ముందు రికార్డులన్నీ ధ్వంసం చేయాలని సూచించినట్లు తెలిపారు. రికార్డులు ధ్వంసం చేసి కొత్తవాటిని అమర్చామని పేర్కొన్నారు. ధ్వంసం చేసిన ఆధారాలను నాగోలు, మూసారాంబాగ్ వద్ద మూసీ నదిలో పడేసినట్లు వెల్లడించారు. సీడీఆర్, ఐడీపీఆర్ డేటా మొత్తం కాల్చేసినట్లు పేర్కొన్నారు. ఫార్మాట్ చేసిన ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లను బేగంపేట నాలాలో పడేసినట్లు తెలిపారు.

## పోలీస్ కస్టడీకి ఎసిపి ఉమామహేశ్వర రావు

**హైదరాబాద్,మే29:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావును పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఉమామహేశ్వరరావు ని ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు. ఉమామహేశ్వరరావును ముగ్గురు అధికారుల బృందం విచారణ చేస్తోంది. ఉమామహేశ్వరరావు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. బినామీ ఆస్తులపై కూడా ఏసీబీ విచారణ చేస్తోంది. రెండు బ్యాంక్ లాకర్లను ఏసీబీ అధికారులు ఓపెన్ చేయనున్నారు. ఏసీబీ విచారణలో మరి కొంత మంది బినామీలు వ్యవహారం బయట పడే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నంలో ఏసీపీగా పని చేసిన సమయంలో జరిగిన అక్రమాలపై లోతుగా విచారణ నిర్వహిస్తున్నారు. అక్రమాస్తుల వివరాలను వెలికి తీసేందుకు ఏసీపీని తమ కస్టడీకి అప్పగించాలంటూ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు సానుకూలంగా స్పందించి.. మూడు రోజుల పాటు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఏసీపీ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ నెల 22న ఆయన నివాసంలో అధికారులు సోదాలు చేసి రూ.3.95 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. ఆ వెంటనే ఏసీపీని అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా.. ఉమా మహేశ్వరరావుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయనను నేడు అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

## పాము కాటుతో టెక్కీ మృతి

**విజయవాడ,మే29:** పాముకాటుతో సాఫ్ట్వేర్ ఇంజినీర్ మృతి చెందిన ఘటన బుధవారం మొవ్వ మండలంలో జరిగింది. రూ.20 లక్షల వేతనంతో ఇంజినీర్ గా ఇంటి నుంచే పనిచేస్తున్న మొవ్వ మండలం పెదపూడి కాలనీకి చెందిన సూర్య మణికంఠ ఆకస్మికంగా చనిపోయాడు. గత సోమవారం రాత్రి ఇంటి వసారాలో పడుకున్న ఇతను, తెల్లారేసరికి నోటి నుంచి నురగ వచ్చి పడి ఉన్నాడు. మొవ్వ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. మూత్ర విసర్జన కోసం వెళ్లినప్పుడు పాము కాటేయగా, నిద్రమత్తులో పడుకోవడంతో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

# ఢిల్లీలో భానుడి ఉగ్రరూపం

## ముంగేష్‌పుర్‌లో 52.3 డిగ్రీల సెల్షియస్‌గా ఉష్ణోగ్రతలు



**న్యూఢిల్లీ,మే29:** ఈశాన్య భారతదేశంలో భానుడి ఉగ్రరూపం కొనసాగుతోంది. సూర్యతాపానికి దేశ రాజధాని నగరం దిల్లీ వాసులు అల్లాడిపోతున్నారు. దిల్లీలో బుధవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దిల్లీలో గతంలో ఎన్నడూలేనంతగా మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ముంగేష్‌పుర్‌లో 52.3 డిగ్రీల సెల్షియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు నమోదైన ఉష్ణోగ్రతల్లో ఇదే అత్యధికమని తెలిపారు. మంగళవారం నార్త్ వెస్ట్ దిల్లీ ప్రాంతంలో 49.9 డిగ్రీలుగా నమోదు కాగా.. ఆ మరుసటిరోజే ఉష్ణోగ్రతలు మరింతగా పెరగడంతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇదిలాఉండగా.. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఎక్కువగా ఏసీలు వినియోగించడంతో దిల్లీలో విద్యుత్ డిమాండు 8,302 మెగా వాట్‌లకు చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఇంత భారీ డిమాండ్ ఉండటం కూడా ఇదే అత్యధికమని పేర్కొన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలావుంటే ఢిల్లీలోని మధు విహార్ ప్రాంతంలోని పార్కింగ్ స్థలంలో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగడంతో పార్కింగ్‌లో పార్క్ చేసిన 17 వాహనాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే తొమ్మిది అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నాయి. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి గంట వ్యవధిలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతం కేసు దర్యాప్తు చేస్తున్నారు. తూర్పు ఢిల్లీలోని మండవాలి పోలీస్ స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి 1 గంట ప్రాంతంలో వాహనాల పార్కింగ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పార్కింగ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు మంటల్లో చిక్కుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల కారణంగా ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది. ఘటనపై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే మండు వేసవి కారణంగానే ఇలా జరిగివుంటుందని అనుమానిస్తున్నారు.

# బిజెపిని ఓడించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు

- మోడీ కొనసాగితే రష్యాలో పుతిన్ లాగే నియంతృత్వం
- ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం - మీడియా ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీమే29:** ఈ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అందుకే కాంగ్రెస్‌తో జతకట్టామని, ఇది శాశ్వతం కాదని స్పష్టంచేశారు. ప్రస్తుతం దేశంలో నియంత పాలన, గుండాగిరి నడుస్తుంది.. దీనికి చరమ గీతం పాడడం కోసమే కాంగ్రెస్ పార్టీతో ఆప్ పొత్తు పెట్టుకుందని ఆయన తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీతో ఆప్ పొత్తు శాశ్వతంగా ఉండదని ఈ సందర్భంగా కేజ్రీవాల్ కుండ బద్దలు కొట్టారు. బుధవారం మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ మాట్లాడారు. జూన్ 4వ తేదీన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో వెలువడ నున్నాయని.. అందులో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాల్లోనే కాంగ్రెస్ పార్టీతో తమ పార్టీ పొత్తు పెట్టుకుందని గుర్తు చేశారు. పక్కనే ఉన్న పంజాబ్‌లో మాత్రం ఆప్, కాంగ్రెస్ పార్టీలు ప్రత్యర్థి పార్టీలుగానే బరిలో నిలిచామని ఆయన వివరించారు. దేశాన్ని రక్షించడం కోసం.. బీజేపీని ఓడించడం కోసమే కాంగ్రెస్, ఆప్‌లు కలిసి ఒక అభ్యర్థిని




బరిలో దింపామని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అయితే పంజాబ్‌లో బీజేపీకి మనుగడ లేదన్నారు.అలాగే ఢిల్లీ మద్యం కేసు.. మనీ లాండరింగ్ వ్యవహారంలో తాను డిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు. అయితే తాను సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ మాత్రమే కోరుకుంటుందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇక బీజేపీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే మాత్రం దేశంలో ప్రముఖ రాజకీయ నేతలంతా జైళ్లలోకి వెళ్లడం ఖాయమన్నారు. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే పుతిన్ సారథ్యంలో రష్యాలో పరిస్థితి ఎలా ఉందో.. దాదాపు అదే పరిస్థితి భారత్‌లో వస్తుందన్నారు. రోవైపు తన పార్టీ నేతలు సత్యంద్ర జైన్, మనీష్ సిసోడియాలు బీజేపీలో చేరితే వెంటనే బెయిల్ లభిస్తుందంటూ ఆ పార్టీ నేతల నుంచి సందేశాలు వెళ్లినట్లు తన వద్ద సమాచారం ఉందన్నారు. ఇక సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ ఘటనపై స్పందించేందుకు కేజ్రీవాల్ నిరాకరించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మాత్రం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితం ముగిసిపోతుందని కేజ్రీవాల్ పునరుద్ఘాటించారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే అమిత్ షా ప్రధాని అవుతారని.. అలాగే యూపీ సీఎం పోస్ట్ నుంచి యోగి ఆదిత్యనాథ్ దిగిపోతారంటూ వివిధ వేదికల మీద నుంచి కేజ్రీవాల్ ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే.

# ప్లాస్టిక్ రహిత జోన్‌గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్

## ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా మార్చేందుకు కార్యాచరణ

### అధికారులతో సీమక్షలో సిఎస్ శాంతికుమారి ఆదేశాలు



**హైదరాబాద్,మే29:** జూలై నెలాఖరులోగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ను పూర్తిగా ప్లాస్టిక్ రహిత జోన్‌గా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుదవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో అటవీ, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సీఎస్ సమావేశమై చర్చించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. కాగితపు సంచులు, గుడ్డ/జనపనార సంచులు, విస్తరాకులు మొదలైన పర్యావరణ అనుకూల ఉత్పత్తుల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎ÷–లాస్టిక్ వినియోగాన్ని నివారించి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడానికి అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో అదనపు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రచారంతో పాటు పంచాయతీలు, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. టైగర్ రిజర్వ్ ఏరియాలో ఎ÷–లాస్టిక్ వాడకంపై నిషేధం గురించి హైవే వెంట ఉన్న స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని నాలుగు ఆవాసాల్లో నివాసముంటున్న ప్రజలను తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. హరితనిధి కింద ఉన్న నిధులను సంబందిత వార్షక సంవత్సరంలోనే వినియోగించుకోవాలని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మైసమ్మ దేవాలయంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్ శాఖ అధికారులను సీఎస్ సూచించారు. ఈ కార్యక్రంలో అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్, పంచాతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఖఅఅఈ ఆర్.యం. డోబ్రియాల్, టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి బుద్ధ ప్రకాష్ జ్యోతి, కమిషనర్ ఎండోమెంట్స్ హనుమంత రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గెలుపుపై ఎవరిధీమా వారిదే

**కాంగ్రెస్, బిజెపిలకు గుణపాఠం తప్పదన్న వేముల**

**కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు చేసిన అధికారులు**



**నిజామాబాద్,మే29:** ఎన్నికల కౌంటింగ్‌కు మరో నాలుగైదు రోజులే ఉండడంతో ఇప్పుడు నిజామాబాద్ గెలుపెవరిదన్న చర్చ జోరుగా సాగుతోంది. అధికార కాంగ్రెస్ మాత్రం జీవన్ రెడ్డి విజయం ఖాయమని చెబుతోంది. అయితే మళ్లీ ధర్మపురి అర్వింద్ గెలుస్తాడని బిజెపి లెక్కలు వేస్తోంది. కాంగ్రెస్, బిజెపిలను ప్రజలు నమ్మలేదని, బిఆర్ఎస్‌కే ప్రజలు ఓటేశారని, అందువల్ల బాజిరెడ్డి గెలుపు ఖాయమమని బిఆర్ఎస్ నేతలు అంటున్నారు. కౌంటింగ్ తరవాత కాంగ్రెస్, బిజెపిలకు దిమ్మ తిరగడం ఖాయమని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ప్రజల సమస్యలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. రైతులు విత్తనాల కోసం నానా తంటాలు పడుతున్నారని అన్నారు. ఇదిలావుంటే ఓట్ల లెక్కింపునకు జిల్లా అధికారులు పక్కగా ఏర్పాట్లు చేశారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సీఎంసీలో జూన్ 4న నిర్వహించే పార్లమెంట్ ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పలువురు సిబ్బంది సందేహాలను మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు అంకితభావంతో పనిచేయాలని, అనుమానాలు, గందరగోళానికి తావిచ్చేలా వ్యవహరించొద్దని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే సహాయ రిటర్నింగ్ అధికారుల దృష్టికి తేవాలని, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు.

# ప్రజా సమస్యలపై పెదవి విప్పాల్సిన సమయమిదే !

ఎన్నికల అంకం పూర్తి కావస్తున్న తరుణంలో ప్రజల సమస్యలను ప్రస్తావించి పరిస్కరించే దిశగా అన్ని పార్టీలు ఆలోచించాలి. ఓ రెండేళ్లపాటు రాజకీయాలను పక్కన పెట్టి వళ్లు వంచి పనిచేయాలి. అన్ని పార్టీలు ఇది అలవాటు చేసుకోవాలి. అప్పుడే దేశానికి మేలు చేసినవారు అవుతారు. అలాకాకుండా ఇంకా తమ రాజకీయాలను ప్రయోగిస్తూ పోతే ప్రజలు కూడా సమయం కోసం వేచిచూస్తారు. ముఖ్యంగా అధికారంలో ఉన్న బిజెపి, అధికారంలోకి రావాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీలు ప్రజల సమస్యలే ఎజెండాగా పనిచేయాలి. ఈ క్రమంలో ఎవరు ఏ పార్టీలోకి మారినా ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ప్రజలు కేవలం పాలనా తీరును మాత్రమే చూస్తున్నారు. తాయిలాలకు కూడా లొంగడం లేదు.తాయిలాలు ఇచ్చి..అభివృద్దిని పక్కన పెట్టిన నేతలను దూరం పెడుతున్నారు. అలాగే ప్రజల సమస్యలు, ధరలు, పన్నులు తదితర అంశాలు కూడా ఎన్నికల్లో ప్రధాన ప్రచారంగా మారాయి. పరస్పర విమర్శలు ఎన్ని చేసుకున్నా..ప్రజల్లో ఉన్న ఆలోచనలకు అనుగుణంగానే ఓట్లు పడివుంటాయి. జూన్1తో ఏడోదశ పోలింగ్ ముగుస్తుంది. అనంతరం 4న ఓట్ల లెక్కింపు జరిగి..మధ్యాహ్నానికి ఎవరు విజేతలో తేలనుంది. అయితే ప్రధానంగా అధికార బిజెపి ఎక్కడా తన ప్రచారంలో పెరుగుతున్న ధరలు,నిరుద్యోగం వంటి సమస్యలను ప్రసతావించలేదు. రాముడిని సెంటిమెంటుగా వాడుకుంది. పాక్‌ను వాడుకుంది. పుస్తెమట్టెలను వాడుకుంది. కాంగ్రెస కూటమి బలహీనతలను ప్రచారంలో పెద్దవిగా చేసి చూపింది. కాంగ్రెస్ మాత్రం నిరుద్యోగం, ధరలు, రాజ్యాంగం, ఆదానీ అంబానీలకు దేశ సంపద దోచిపెట్టడం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించింది. అయితే ఈ అంశాల ప్రభావం ఎలా ఉందన్నది ఇప్పుడే చెప్పలేం. అందుకే రాజకీయ నేతలు అటుఇటుగా మారినా ప్రజలు పట్టించుకోలేదు. పరస్పరం తిట్టిపోసుకున్నా పట్టించుకోలేదరే చెప్పాలి. అలాగే ప్రధానంగా ప్రజల సమస్యలను ఏ పార్టీ కూడా పెద్దగా ప్రచారం చేయలేదు. అందుకే రాజకీయాల్లో బంధాలు శాశ్వతంగా నిలబడడం లేదు.. అటువారు ఇటు ఇటువారు అటు మారుతున్నారు. అధికారం ఉన్న పార్టీల్లోకి వలసలు పెరిగాయి. ఎవరిపై రాజకీయ ప్రేమలు శాశ్వతంగా ఉండవని మాత్రం గుర్తించాలి. ఇక తెలంగాణను తీసుకుంటే ..కాంగ్రెస్‌కు అధికారం రావడంతో పలువురు అధికార పార్టీలో చేరుతున్నారు. ఓట్లు కొల్లగొట్టేం దుకు ఎవరు పార్టీలు మారినా పట్టించుకోలేదు. ఎన్నికలను చూస్తుంటే ప్రజలపట్ల అన్ని పార్టీలు ప్రేమలు ఒలకబోస్తున్నాయి. ఎన్నికల ముందున్న ప్రేమలు ఎన్నికలయ్యాక నిలబడడం లేదు. కులాల వారీగా రాజకీయ ప్రేమలను ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో కాంగ్రెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. అధికారంలో ఉండగా బిఆర్ఎస్ ఇలాగే వ్యవహరించింది. ప్రజలను పట్టించుకోలేదు. కేవలం కుటుంబ సంక్షేమమే పాలనగా చూసింది. ఇప్పుడు గగ్గోలు పెట్టినా ఆ పార్టీ గురించి ప్రజలు పట్టించు కోవడం లేదు. ఆదిలాబాద్‌లో పత్తిరైతులపై లాఠీఛార్జిని ఖండించిన బిఆర్ఎస్ నేతలు..గతంలో అసలు నడ్డీనే విరిచారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌ల పేరుతో రైతుల ఉసురు తీసారు. భూములను గుంజుకున్నారు. లాఠీ ఛార్జీలు చేశారు. కోర్టుల చుట్టూ తిప్పారు. జైళ్లలో పడేశారు. ఖమ్మం జిల్లాలో కాల్పులు జరిపారు. మద్దతు ధరలు ఇవ్వలేదు. సకాలంలో గింజలు కొనలేదు. ఇవన్నీ మరచిన బిఆర్ఎస్ నేతలు చిలకపలుకులు పలుకుతున్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం ప్రజలపై కపటప్రేమను ఒలకబోసారు. ఇవన్నీ అనుభవించిన ప్రజలు బిఆర్ఎస్ అనే పార్టీని, కెసిఆర్ అనే నాయకుడిని ఇంకా నమ్ముతారని అనుకుంటే పొరపాటే. అలాగే తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ మెల్లగా సైడ్ ట్రాక్ పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. బిఆర్ఎస్ బాటలోనే బిజెపి కూడా విమర్శలు చేస్తోంది. అంతే తప్ప న ఇర్మానాత్మక సహకారం ఇవ్వడం లేదు. విపక్షం అంటే విమర్శించడమే ఇక్కడి బిజెపి నేతలు నేర్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని అస్త్రాలను ప్రయోగించింది. తెలంగాణ అంటే కెసిఆర్..కెసిఆర్ అంటే తెలంగాణ అని బిల్డప్ ఇచ్చారు. అందుకే బిఆర్ఎస్, బిజెపిలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు అధికార పార్టీ అదే దూకుడు ప్రయోగిస్తోంది. కృష్ణా ప్రాజెక్టులు, కాళేశ్వరం విషయంలో బీజేపీ తన వాదనను సమర్థంగా వినిపించడం లేదు. కేంద్రం నుంచి అందాల్సిన సాయం అందించడం లేదు. బిజెపి విమర్శల వెనక రాజకీయం ఉందా..రాష్ట్ర ప్రయోజనాలు ఉన్నాయా అన్నది ప్రజలు బాగా ఆలోచిస్తూనే ఉంటారు. కృష్ణా ప్రాజెక్టులు అప్పగించడం లేదా కేంద్రం ఆధీనంలో ఉంచుకోవడం విషయంలో బిజెపి ఆడుతున్న రాజకీయాలు అంతాఇంతాకాదు. ఇక్కడున్న బిజెపి నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, బండి సంజయ్‌లకు రాజకీయం తప్ప తెలంగాణ ప్రయోజనాలు పట్టడం లేదు. వివిధ సమస్యలపై దాటవేత ధోరణి ప్రదర్శించిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికలకు ముందు తీర్చలేని సమస్యగా మారిందని గుర్తించలేక పోయారు. ఇకపోతే బిజెపి నేలవిడిచి సాము చేస్తోంది. బిఆర్ఎస్ అలా చేసే చతికిల పడింది. 'కాంగ్రెస్ ముక్త భారత్' అన్న నినాదం తరవాత కాంగ్రెస్ బాగానే పుంజుకుంది. కర్నాటక, తెలంగాణల్లో అధికారం సాధించింది. కాంగ్రెస్ ముక్త భారత్ అన్నది ప్రజల్లోంచిరావాలి. ప్రజలు మూకుమ్మడిగా బిజెపి మాత్రమే దేశానికి అవసరమని గుర్తించాలి. అలా జరగనప్పుడు బీజేపీ కలలు కంటున్న కాంగ్రెస్ ముక్త భారత్ సాధ్యం కాకపోవచ్చు. గత పదేళ్ల బీజేపీ నిర్వాకంలో ఏ రంగం ఎంత అధ్వాన్నస్థితిలో ఉన్నదో మోడీ ద్వయం కావచ్చు..రాష్ట్రాల్లో ఉన్న నేతలు కావచ్చు..ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజల ఆకాంక్షల ను నెరవేర్చామా లేదా అన్నది చెప్పాలి. ప్రత్యక్షంగా అనుభవిస్తున్న ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలను రాష్ట్రాల నాయకులు కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లాలి. మరోమారు అధికారంలోకి వస్తే ఈ సమస్యలను పరిష్కరించాలని సూచించాలి. ఎదురుపడి మాట్లాడే ధైర్యం లేకుంటా వినతిపత్రం రూపంలో అందచేయాలి. అలా చేయలేని నాడు నేతలుగా ఉండడం తగదు.

# కార్పోరేట్ స్కూళ్ల దోపిడీకి కళ్లెం వేసేదెవరు

**- ధనార్జనే ధ్యేయంగా ఫీజుల వసూళ్లు - చోద్యం చూస్తున్న ప్రభుత్వాధికారులు**



**హైదరాబాద్,మే29** జూన్ 12న స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. అకడమిక్ కేలండర్‌ను ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రైవేట్ స్కూళ్లపై అజమాయిషీ మాత్రం చేయడం లేదు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వానికి కార్పోరేట్ స్కూళ్ల నుంచి వాటాలు ముట్టేవని, అందువల్ల ఫీజులను తగ్గించలేకపోయారు. అలాగే కార్పోరేట్ స్కూళ్లి తమ ఇష్టానుసారం ఫీజులను నిర్ణయిస్తున్నాయి. విధిలేక కొందరు తల్లిదండ్రలుఉ చెమటోడ్చి పిల్లల చదువల కోసం వెచ్చిస్తున్నారు. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పట్టించుకుంటుందా లేదా అన్నది మరో పక్షం రోజుల్లో తేలనుంది. ఇప్పటికే వచ్చే ఏడాదికి సంబంధించి అడ్మిషన్ల వ్యవహారం పూర్తయ్యింది. ప్రైవేట్ స్కూళ్లు యధావిధిగా వసూళ్లకు తెగబడ్డాయి. వివిధ రకాల ఫీజులు, తదితరాలతో తల్లిదండ్రులను పీల్చి పిప్పిచేసే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో వీరి దృష్టి అంతా వసూళ్లపైనే ఉంది. విద్యార్థులు, టీచర్లపై వారికి దృష్టి ఉండడం లేదు. టీచర్లకు సకాలంలో జీతాలు ఇవ్వాలన్న లక్ష్యం పక్కకు పోయింది. కరోనా కాలంలో తామే దివాళా తీసామని ఏడుపు మొఖాలు పెడుతున్నాయి. ఫీజలును పెంచేసి డబ్బులు లాగేయాలన్న లక్ష్యంతో కార్పోరేట్ స్కూళ్లు తల్లిదండ్రులను వేధించడం అలవాటుగా చేసుకున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థలు తమ డబ్బు కోసం విద్యావ్యాపారాన్ని నిర్లజ్జగా కొనసాగిస్తున్నారు. తమ ఫీజులను రాబట్టుకనే క్రమంలో వారు ఎంత కఠినానికైనా దిగజారుతున్నారు. అంతా మీ పిల్లల కోసమే అని చెప్పి పరోక్షంగా తప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ఫీజుల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం రంగంలోకి దిగాలి. ఇబ్బడిముబ్బడిగా లక్షల్లో పెంచేసిన ఫీజులను నియంత్రించాలి. అదే క్రమంలో ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహద పడుతుందని రుజువు చేయాలి. అలాగే ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు చదువును కొనే దుస్థితి నుంచి బయటపడేలా చేయాలి. సామాన్యులకు చదవును దగ్గర చేసేందుకు ఎంతయినా ఖర్చు చేయాలి. అప్పుడే విద్యారగం పటిష్టం కాగలదు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గగలదు. లేకుంటే విద్య కోసం పేదలు సైతం లక్షల్లో ఖర్చు చేసేందుకు అప్పుల బారిన పడుతున్నారు. కార్పోరేట్ స్కూళ్ ఫీజు దోపిడీలను అరికట్టాలి. నిర్ణీత ఫీజులు ఉండేలా చూడాలి. అందుకు తెలుగు రాష్ట్రాల్లో గట్టి కృషి జరగాలి. గతంలో తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్క లేదు. కులరహిత హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇంతటి ఉదాత్తమైన పథకం ఎందుకనో ముందుకు సాగడం లేదు. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుందని తెలిసినా దాని గురించి పట్టించుకోవడం లేదు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు సర్కార్ స్కూళ్లోనే లభించాలి. గతంలో బాగా పనిచేసిన ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేయకుండా ముందస్తు చర్యలకు దిగాలి. ప్రముఖులు లేదా నిపుణుల సలహాలతో ముందుకు సాగాలి. సామాన్యులకు విద్యను చేరువచేసే లక్ష్యంతో అనేక విధాలుగా ప్రయత్నాలు మొదలు పెట్టాలి. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలన్నీ పూర్తిగా మార్చేందుకు పక్కాగా కార్యక్రమం అమలు చేయాలి. నిధుల కేటాయింపులో విద్యావైద్యరంగాలకు పెద్దపీట వేయాలి. ప్రతి పిల్లాడిని చదివించడమే కాదు.. వారు భావితరంతో పోటీ పడాలన్న లక్ష్యం మేరకు ముందుకు సాగేలా చేయాలి. వీటన్నింటితో పాటు తెలుగును తప్పనిసరి స్జబెక్టుగా చేయాలి.. దీంతో కార్పోరేట్ స్కూళ్ల ఫీజు దోపిడీకి కళ్లెం పడనుంది. వేలకోట్లు ప్రజల నుంచి పీలుస్తున్న విద్యాసంస్థలకు ముకుతాడు పడనుంది. ప్రభుత్వమే నాణ్యమైన విద్యను, ఇంగ్లీష్ మీడియాన్ని ప్రకటించి ముందుకు సాగితే విద్యారంగంలో విప్లవం రాకమానదు.

# కోట్లకు పడగెత్తిన పిన్నెల్లి


**- అక్రమార్జనతో పాటు..అక్రమాలు - నేర సామ్రాజ్యానికి నాయకుడు - పుస్తకం విడుదల చేసిన టిడిపి**



**అమరావతి,మే29:** రెండు లక్షల నుండి రెండు వేల కోట్లకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎలా ఎదిగాడో జగన్ రెడ్డి నేర సామ్రాజ్యంలో ఇదొక కేస్ స్టడీ అని టీడీపీ నేతలు ప్రకటించారు. పిన్నెల్లి నేర సామ్రాజ్యంపై టీడీపీ పుస్తకం విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరినీ నామినేషన్లు వేయకుండా అరాచకం సృష్టించిన పిన్నెల్లిని ఆదర్శంగా తీసుకోమని జగన్ మిగతా ఎమ్మెల్యేలకు చెప్పాడని.. ఈవీఎంలు ధ్వంసం చేసినందుకు చర్యలు తీసుకోకుండా వీడియో ఎలా వచ్చిందని సజ్జల ప్రశ్నించడం వారి అరాచకాన్ని ఏ స్థాయిలో ప్రోత్సహిస్తున్నారో అర్థమవుతుందన్నారు. పిన్నెల్లి చేసిన 79 అరాచకాల్లో 51 పైగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలపై చేసినవేనని టీడీపీ నేతలు తెలిపారు. పోలింగ్ మొదలవగానే ఏజెంట్లపై దాడులు చేశారు గొడ్డలి దెబ్బతిని మరి పోలింగ్ ఏజెంట్ గా కూర్చున్న పలనాటి మహిళ ధైర్యాన్ని.. ఈవీఎం ధ్వంసాన్ని అడ్డుకున్న శంకర్రావు తెగువను దేశం మొత్తం చూసిందన్నారు. కారంపూడి, మాచర్లలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాలను తగలబెట్టారని.. ఒక సీఐపై దాడి చేస్తే పది రోజుల పైగా కేసు పెట్టలేని దుస్థితి కి వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారు అందుకే ఈవియం ల ధ్వంసానికి పాల్పడ్డాడని మండిపడ్డారు. చేసిన తప్పులకు, అరాచకాలకు రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మాచర్లలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో దేవాలయాల్లో విగ్రహాలు దొంగతనం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇచ్చారని బుద్దా వెంకన్న ఆరోపించారు. ఆనాడు గెలిచినప్పటి నుంచి పిన్నెల్లి, అతని సోదరుడి అరాచకాలకు అడ్డే లేకుండా పోయిందన్నారు. నియోజకవర్గంలో పిన్నెల్లి పైశాచికత్వానికి అంతులేకుండా పోయిందన్నారు. పిన్నెల్లి సంపాదించుకోవడానికి వారికి వారే ఒక సపరేటు చట్టాన్ని రూపొందించుకున్నారని మండిపడ్డారు. 1996 నుంచి ఉమ్మడి ఏపీలో ఫ్యాక్షనిజం లేకుండా చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఈవీఎంలలో టీడీపీకి 18 ఓట్లు పోలైతే... వైసీపీకి 7 మాత్రమే వస్తున్నాయని.. దీనిని బట్టే పిన్నెల్లిపై ప్రజలకు ఉన్న వ్యతిరేకత తెలుస్తోందన్నారు. 4 ఓట్లల్లో 1 ఓటు పిన్నెల్లికి, 3 ఓట్లు బ్రహ్మారెడ్డికి పడ్డాయని జోస్యం చెప్పారు. అందుకే పిన్నెల్లి అరాచకానికి తెరలేపారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మార్చి 11న మాచర్లలో జరిగిన హింసలో తాను గాయపడ్డానని... ఇక్కడ లా అండ్ ఆర్డర్ అదుపులో ఉండదని హైకోర్టు అడ్వోకేట్ కిషోర్ అన్నారు. ఇక్కడ కొందరు పోలీసులు యూనిఫామ్ కూడా వేసుకోరని ఆరోపించారు. పిన్నెల్లి పైశాచికత్వంతో విర్రవీగాడని... అందుకే అతని నేరానికి సంబంధించిన అన్ని వివరాలతో పుస్తకాన్ని విడుదల చేశామని పిల్లి మాణిక్యరావు తెలిపారు. వందల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నాడని ఆరోపించారు. పిన్నెల్లి రోడ్డు మీదికి వస్తే బందిపోటు దొంగలను కొట్టినట్లుగా కొడతారని హెచ్చరించారు.రానున్న రోజుల్లో పిన్నెల్లి తగిన మూల్యం చెల్లించుకుంటాడని హెచ్చరించారు. పిన్నెల్లిపై ఉన్న కేసులన్నింటినీ కోర్టులో నిరూపించి తగిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# టిడిపితోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం

**- ఎన్నికల ఫలితాల్లో టిడిపి కూటమిదే విజయం - ఎంపి రామ్మోహన్ నాయుడు భరోసా**



**శ్రీకాకుళం,మే29:** సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్ళు అనే సిద్ధాంతంతో టీడీపీ పనిచేస్తుందని టిడిపి ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. టిడిపి వచ్చిన తరవా తనే బడుగు,బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు దక్కాయన్నారు. మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై ప్రజలకు మోజు తగ్గిందని, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఓట్ల రూపంలో నమోదు అయ్యిందని అన్నారు. ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. నవరత్నాలు సైతం సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. సకాలంలో పెన్షన్లు సక్రమంగా అందించలేదని అన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో టిడిపి కూటమి ఘన విజయం సాధించబోతోందని అన్నారు. పేదవాడు దౌర్భాగ్య పరిస్థితి అనుభవిస్తున్నాడని తెలిపారు. గ్రామ సచివాలయాలు సక్రమంగా పనిచేయలేదని, ప్రజలు తమ సమస్యలపై టీడీపీని ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. హోదాపై ఐదేల్లుగా జగన్ ఎందుకు మాట్లాడలేక యారని నిలదీశారు. జగన్ పులకేసి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. జగన్ సర్కార్ అరాచక పాలనతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని ఎంపి అన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లామని అన్నారు. సార్వ త్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి సీఎంగా చంద్రబాబును చేసేందుకు కార్యకర్తలు, నేతలు సైనికుల్లా పనిచేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వానిది నిరంకుశ పాలన అని టీడీపీ నేత విమర్శించారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే వారిని బెదిరించడం, కేసులు పెట్టి వేధించడం జగన్ పాలనలో పరిపాటిగా మారిందన్నారు. వైసీపీ పాలనపై అన్నివర్గాల ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు.

## శ్రీనివాసమంగాపురంలో ముగిసిన వసంతోత్సవాలు



**తిరుపతి,మే29:** శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు.భూ సమేత వేంకటేశ్వరస్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను వసంత మండపంలోకి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలసూక్తం, విష్ణుసూక్తం, దశ శాంతి మంత్రములు, తైత్తరీయ ఉపనిషత్తు, దివ్య ప్రభందములో అభిషేక సమయంలో అనుసంధానము చేసే నిరాట్టమ పాశురాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున మొత్తం ఏడు రకాల మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, భక్తులు పాల్గొన్నారు.

## పెన్షన్ల కోసం రూ. 1939.35 కోట్ల విడుదల

**నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ**

**అమరావతి,మే29:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్ల కోసం నిధులు విడుదల చేసింది . రాష్ట్రంలోని 68,30,808 మందికి రూ. 1939.35 కోట్లను విడుదల చేసింది. జూన్ 1న 47,74,733 మంది బ్యాంకు ఖాతాలకు పింఛన్లు జమ అవుతాయని స్పష్టం చేసింది. మిగతా లబ్దిదారులకు జూన్ 1 నుంచి 5వ తేదీ మధ్య ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేస్తారని వివరించింది. రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పింఛన్ల పంపిణీ వివాదస్పదంగా మారింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల నాటి నుంచి ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పింఛన్ల పంపిణీపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసుకున్నారు. ఎన్నికల్లో లబ్దిపొందేందుకు అధికార వైసీపీ వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవాలని టీడీపీ (ఃఆఖ) ఫిర్యాదు చేయడంతో ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీ ఆలస్యం జరిగింది. పింఛన్‌దారులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి పింఛన్‌ను తీసుకెళ్లే పక్రియను ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయానికి రాలేని వృద్ధులు అనేక మంది ఇబ్బందులు పడ్డారు. ఒకరిద్దరు వృద్ధులు వడదెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోయ్యారు. ఎన్నికలు ముగియడంతో మే నెలకు చెందిన పింఛన్ డబ్బును పంపిణీకి ఏర్పాట్లు చేసింది. పింఛన్ల పంపిణీలో ఎన్నికల నియమావళి పాటించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంటింటికి వెళ్లి ఎవరూ పంపిణీ చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయకపోవడం గందరగోళ పరిస్థితికి దారితీస్తోంది .

## హత్యాయత్నం కేసులో టీటీడీ డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మి అరెస్టు

**తిరుపతి,మే29:** టీటీడీ డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మిని పోలీసులు అరెస్టు చేశారు. వెంకటశివారెడ్డిపై హత్యాయత్నం కేసులో శ్రీలక్ష్మితో పాటు ఆమె భర్త చంద్రారెడ్డి, మరో ఇద్దరిని అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి ఎన్జీవో కాలనీలో వెంకట శివారెడ్డి అనే వ్యక్తిపై ఈ నెల 25వ తేదీన హత్యాయత్నం జరిగింది. దుండగులు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వెంకటశివారెడ్డి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను వాంగ్మూలం ఇచ్చే పరిస్థితిలో లేకపోవడంతో ఘటనాస్థలిలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. అందులో వెంకటశివారెడ్డిని అతని అపార్ట్‌మెంట్ ముందే ఇద్దరు వ్యక్తులు అడ్డగించి కత్తితో తలపై నరికినట్లుగా సీసీ టీవీలో ఫుటేజీలో కనిపించింది. అడ్డగించిన వారిలో ఒక మహిళ కూడా ఉంది. కానీ సీసీ టీవీ ఫుటేజిలో దాడి చేసిన వ్యక్తుల మొహాలు సరిగ్గా కనిపించలేదు. దీంతో వాళ్లు ఎవరై ఉంటారా? అని ఆరా తీయగా.. వెంకటశివారెడ్డి ఎదురు ప్లాట్‌లో ఉండే టీటీడీ ఈఈ శ్రీలక్ష్మి, ఆమె భర్త గిరీశ్ చంద్రారెడ్డి అని తెలిసింది. ఎదురెదురు ప్లాట్లలో ఉండటంతో పలు విషయాల్లో వీరి కుటుంబాల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఈ క్రమంలోనే వెంకటశివారెడ్డిపై కక్ష పెంచుకుని ఈ దారుణానికి ఒడిగట్టునట్లు వెల్లడైంది.

## పోస్టల్ బ్యాలెట్‌పై సడలింపు

**హైకోర్టులో అప్పీల్ చేస్తామన్న వైవి**

విశాఖపట్నం,మే29(ఆర్ఎన్ఎ): పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ సంతకం సడలింపుపై హైకోర్టుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామని వైఎస్సార్‌సీపీ నేత వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఈసీ వ్యవహారశైలిని హైకోర్టులో తేల్చుకోనున్నామన్నారు. దేశం అంతటా ఒక రకమైన నిబంధనలు ఉంటే ఏపీలో ఈసీ ప్రత్యేక రూల్స్ చెబుతోంది. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ సంతకం లేకుంటే దానిని తిరస్కరించడం నిబంధన. కానీ ఏపీలో మాత్రం గెజిటెడ్ సంతకం లేకపోయినా అనుమతించడంపై సీఈసీకి ఫిర్యాదు చేశామని వైవీ అన్నారు. సీఈసీ స్పందించకపోతే హైకోర్టుకు వెళ్తామని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి..పాత్రధారి కెసిఆర్

**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శలు**

**జగిత్యాల,మే29:** ట్యాపింగ్‌లో ప్రధాన బాద్యుడు కేసీఆరేనని మాజీ సీఎం కేసీఆర్ పైకాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఇందులో ప్రధాన సూత్రధాని, దోషి కూడా కెసిఆర్ అని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ స్వయంకృపారాధం వల్లే అధికారం కోల్పోయారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుని సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. దేశంలో ప్రధాని మోదీ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని అన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు చేసే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. గతంలో ఆంధ్రా సినిమాలకు పన్ను మినహాయింపు ఇచ్చిన బీఆర్ఎస్.. ఇప్పుడు రాష్ట్రగీతాన్ని కీరవాణితో పాడించడాన్ని తప్పు పట్టడం విడ్డూరంగా ఉందన్నారు జీవన్ రెడ్డి. అన్ని వర్గాల్లో ఆర్థిక వెనుకబడిన వారికి ఇచా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు.

## విజయవాడలో రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

**ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి**

**విజయవాడ,మే29:** నగరంలో మరోసారి గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. విధి నిర్వహణలో ఉన్న విజయవాడ గవర్నర్‌పేట డిపో-1కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సీహెచ్ ఎస్ రావుపై అల్లరి మూకలు దాడి చేశారు. మంగళవారం అర్ధరాత్రి వరంగల్ నుంచి కార్గో వాహనం నడుపుతూ విజయవాడ వస్తుండగా.. ఇబ్రహీంపట్నం కూడలి దాటాక దాడి జరిగింది. ఆర్టీసీ కార్గో వాహనాన్ని వెంబడించి, కారు అడ్డంపెట్టి డ్రైవర్‌పై రౌడీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేశారు. పదునైన ఆయుధంతో తలపై పొడిచారు. దాడిలో డ్రైవర్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని తొలుత విద్యాధరపురంలోని ఆర్టీసీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కాకులు నేర్పిన పాఠం



ధ్రువ మూడో తరగతి చదువుతున్నాడు. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి ధ్రువకు ఎక్కువ. పరిసరాలలో జరుగుతున్న సంఘటనల పట్ల కూడా ఎక్కువగా స్పందించేవాడు. ధ్రువ అమ్మ జానకి కూడా అతనికి ప్రతిరోజు ఎన్నెన్నో కొత్త విషయాలు చెప్పేది.

ఒకరోజు ధ్రువ అమ్మతో కలిసి ఉదయపు నడకకు వెళ్తున్నాడు. దారిలో వారు చూస్తుండగానే ఒక కాకి దబ్బున కిందపడింది. కొద్దిసేపట్లోనే అక్కడ చాలా కాకులు గుమి కూడాయి. కిందపడ్డ కాకిని చూస్తూ కావు కావు అని అరుస్తున్నాయి. అందులో ఒక కాకి కింద పడ్డ కాకిని అటు ఇటు కదిలిస్తున్నది మరొక కాకి తన ముక్కుతో దాని ముక్కును కదిలిస్తున్నది. ఇంకొక కాకి కింద పడ్డ కాకిని తీసుకొని పైకి లేవడానికి ప్రయత్నిస్తున్నది.

ఇదంతా చూసిన ధ్రువ అమ్మను ఇక్కడ ఏం జరుగుతుంది అని అడిగాడు. అప్పుడు జానకి కొడుకు కు కాకుల గురించి వివరించింది. ఒక కాకి ప్రమాదవశాత్తు కింద పడినందున మిగతా కాకులు దానిని కాపాడే ప్రయత్నం చేస్తున్నాయి. ఇంకా మరిన్ని కాకులను జమ చేయడానికి కావు కావుమని అరుస్తున్నాయి చూసావు కదా ఆకులలో ఐకమత్యం ఎక్కువ. ఒకరికొకరు సహాయం చేసుకునే గుణం కూడా ఎక్కువే అని వివరించింది. అప్పుడు ధ్రువ అమ్మతో నెల రోజుల క్రితం రోడ్డు పైన ప్రమాదం జరిగి ఒక వ్యక్తికి గాయాలయితే అందరూ అలా చూస్తూ వెళ్ళిపోయారే తప్ప ఎవరు ఆగి ఇలా కాకుల మాదిరిగా సహాయం చేయలేదు అన్నాడు. అలా ప్రవర్తించడం తప్పు అని అమ్మ చెప్పింది. ఎప్పుడైనా ఎవరైనా ప్రమాదంలో ఉన్నప్పుడు తగిన సహాయము చేయాలి అన్నది. నీవు కూడా ఇలాంటి సందర్భాలలో ఇతరులకు సహాయం చేయాలని చెప్పింది.

అలా కొన్ని రోజులు గడిచిపోయాయి ఒకరోజు ధ్రువ ఆటోలో బడి నుంచి ఇంటికి వస్తున్నాడు. రోడ్డు పక్కన ఒక ముసలాయన మండుటెండలో పడి ఉన్నాడు. అది చూసిన ధ్రువ ఆటోలో గల మిగతా విద్యార్థులను ఆ ముసలాయన గురించి మాట్లాడాడు. అతనికి ఏమైందో తెలుసుకొని కాపాడుదాం అన్నాడు. కానీ వారు ఎవరు దానికి అంగీకరించలేదు. ఇంటికి వెళ్లడం ఆలస్యం అయితే అమ్మ తిడుతుంది అన్నారు. కానీ ధ్రువ వాళ్లకు కాకుల గురించి వివరించాడు. అవి ఒకరికి ఆపద వస్తే మిగతావి ఎలా సహాయం చేస్తాయో తాను చూసిన సంఘటనను వివరించాడు. అప్పుడు విద్యార్థులందరూ ధృవ చెప్పిన మాటలకు అంగీకరించి ఆటోను ఆపి కిందికి దిగారు.

ముసలాయన దగ్గరకు చేరుకున్నారు. తమ దగ్గర ఉన్న కొన్ని నీళ్లను తాగించారు. ముఖం మీద కొన్ని నీళ్ళు చల్లారు. అతనిలో కొంత కదలిక వచ్చింది. వెంటనే ఆటోలో ఎక్కించుకొని హాస్పిటలుకు తీసుకెళ్లారు. హాస్పిటల్లో చూపించిన తర్వాత ముసలాయన ఆరోగ్యం కొద్దిగా నయమైంది. ముసలాయన వివరాలు తెలుసుకుని అతన్ని మరో ఆటో ఎక్కించి వారి ఇంటికి పంపించారు. పిల్లలందరూ సంతోషంగా తమ ఆటోలో ఇంటికి చేరుకున్నారు. ధ్రువ ఇంటికి రావడం ఆలస్యం అయ్యేటప్పటికి జానకి వాకిట్లో నిలబడి ఆతృతగా ఎదురు చూస్తున్నది. ధృవ రాగానే ఆప్యాయంగా పలకరించి ఆలస్యానికి కారణం అడిగింది. ధ్రువ ముసలాయనకు చేసిన సహాయం గురించి పూసగుచ్చినట్టు తల్లికి వివరించాడు. ధృవను ఎత్తుకొని జానకి ముద్దాడింది. ఒక మంచి పని చేసినందుకు అభినందించింది. దానికి ధ్రువ నాకు ఆరోజు కాకులను చూసిన తర్వాతనే ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని తెలిసింది అన్నాడు. అందుకొరకే ఈరోజు ఆ ముసలాయనకి సహాయం చేసానన్నాడు. ధ్రువను మరొకసారి మెచ్చుకున్న తల్లి ఇలాగే భవిష్యత్తులో మరింత మందికి సహాయం చేయాలని ధ్రువను కోరింది.

**పోరెడ్డి అశోక్**
**ఆదిలాబాద్ - 504001**




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# మోడీ లాంటి ప్రధాని మనకు అవసరం లేదు

**- కావాలంటే ఓ గుడి కట్టిస్తాం పూజించుకోండి - కోల్‌కతా ర్యాలీలో మమతా బెనర్జీ విమర్శలు**



**కోల్‌కతా,మే29:** భారతదేశానికి నరేంద్ర మోదీ లాంటి ప్రధానమంత్రి అవసరం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. తాను ఎంతోమంది ప్రధానమంత్రులతో కలిసి పని చేశానని, కానీ మోదీ లాంటి వ్యక్తిని ఎప్పుడూ చూడలేదని దుయ్యబట్టారు. దేవుళ్లు రాజకీయాలు చేయకూడదని, అల్లర్లను ప్రేరేపించకూడదని విమర్శించారు. తాను బయోలాజికల్‌గా జన్మించలేదని, ఒక లక్ష్యం కోసం ఆ దేవుడే తనని ఈ భూమి మీదకు పంపించాడని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఆమె ఈ విధంగా స్పందించారు. కోల్‌కతాలో నిర్వహించిన ఓ ర్యాలీలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. 'ఒకరేమో ప్రధాని మోదీ దేవుళ్లకే దేవుడు అంటారు. ఒక నాయకుడేమో సాక్షాత్తు ఆ జగన్నాథుడే మోదీకి భక్తుడని చెప్తాడు. ఒకవేళ మోదీ దేవుడే అయితే, ఆయన రాజకీయాలు చేయకూడదు. దేవుడు అల్లర్లను ప్రేరేపించకూడదు. కావాలంటే ఆయన కోసం ఒక గుడి నిర్మించి, తరచూ పూజలు నిర్వహిద్దాం. పువ్వులు, ప్రసాదాలు సమర్పిద్దాం. ఒకవేళ ఆయన కోరుకుంటే ఢోక్లా కూడా అందజేద్దాం' అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇంకా ఆమె మాట్లాడుతూ.. 'నేను అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్, రాజీవ్ గాంధీ, నర్సింహారావు వంటి ప్రధానమంత్రులతో కలిసి పని చేశాను. కానీ.. మోదీ లాంటి వ్యక్తిని చూడలేదు. అలాంటి ప్రధాని దేశానికి అవసరం లేదు' అని తీవ్ర స్థాయిలో మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'నన్ను విమర్శించే వ్యక్తులున్నారు, నాపై అభిమానం కురిపించే వ్యక్తులూ ఉన్నారు. ఎవరేమనుకున్నా.. విశ్వాసం వ్యక్తం చేసే వారిని బాధపెట్టకుండా చూడటమే నా కర్తవ్యం. ఆ దేవుడు నన్ను ఓ లక్ష్యం కోసం ఎంపిక చేసుకున్నాడని నేను నమ్ముతాను. ఆ లక్ష్యం నెరవేరిన తర్వాత నా పని పూర్తవుతుంది. అందుకే నేను ఆ భగవంతునికి పూర్తిగా అంకితం చేసుకున్నాను' అని అన్నారు. ఆ దేవుడు తన వ్యూహాల్ని బహిర్గతం చేయడని, తనతో పనులు చేయిస్తున్నాడని ఆయన చెప్పారు. ఈ వ్యాఖ్యలకు కౌంటర్‌గానే.. మమతా బెనర్జీ పైవిధంగా సెటైర్లు వేశారు.

### వివేకానంద రాక్‌పై ధ్యానముద్ర


# వహించనున్న మోడీ

**ప్రధాని రాకతో భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం**

**కన్యాకుమారి,మే29:** దేశవ్యాప్తంగా గురువారంతో ఎన్నికల ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఏడోదశ ఎన్నికలు జూన్ 1న జరగనున్నాయి. ఇందులో ప్రధాని మోడీ పోటీ చేస్తున్న వారణాసి కూడా ఉంది. ఈ క్రమంలో ప్రచారం ముగిసిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ కన్యాకుమారిలో సేదదీరనున్నారు. మోడీ సందర్శనను పురస్కరించుకుని కన్యాకుమారిలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన భద్రత కోసం 2,000 మంది పోలీసులు, వివిధ భద్రతా ఏజెన్సీలతో మోహరించనున్నారు. స్వామి వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ధ్యానం చేసేందుకు ప్రధాని మోడీ గురువారం కన్యాకుమారి రానున్నారు. 2019లో కూడా ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం ప్రధాని మోడీ కేదార్‌నాథ్ గుహలో ధ్యానంలో కూర్చున్నారు. మే 30న లోక్‌సభ ఎన్నికల ప్రచారం పరిసమాప్తం అయిన సందర్భంగా ప్రధాని మోడీ వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ధ్యానం చేస్తారని బిజెపి నాయకులు తెలిపారు. మే 30 సాయంత్రం నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం వరకు ధ్యాన మండపం వద్ద 45 గంటల పాటు ధ్యానం చేస్తారని వారు తెలిపారు. ప్రఖ్యాత హిందూ ధర్మ ప్రచారకుడు, సాధువు స్వామి వివేకానంద ఈ ధ్యాన మండపంలోనే భారత మాత గురించి తన దార్శనికతను పొందారని ప్రజలు విశ్వసిస్తారు. మోడీ కన్యాకుమారి సందర్శనను పురస్కరించుకుని భద్రతను కట్టుదిట్టం చేశారు. రాక్ మెమోరియల్, బోట్ జెట్టీ, హెలిప్యాడ్, ప్రభుత్వ అతిథి గృహం వద్ద భద్రతా ఏర్పాట్లను తిరునల్వేలి రేంజ్ డిఐజి ప్రవేష్ కుమార్, ఎస్‌పి ఇ సుందరవదనం బుధవారం పర్యవేక్షించారు. ప్రధానికి చెందిన ప్రత్యేక భద్రతా బృందం కూడా ధ్యాన మండపం చేరుకుని భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసింది.

# అపర శ్రీ శుకుడు రాజన్న శాస్త్రి

## నేడు పరమ భాగవత తోత్తముని వర్ధంతి



కోటి రతనాల వీణ తెలంగాణ లోని కరీంనగర్ జిల్లా గోదావరి తీరం శ్రీలక్ష్మీనర సింహ దివ్య పుణ్యక్షేత్రం. ధర్మపురిలో వేద పురాణ జ్యోతిష, సంగీత, సాహిత్య కళా రంగాలకు చెందిన పండితులు, విద్వాంసులు, ఆధ్యాత్మిక వేత్తలు జన్మించి ఆఖండ కీర్తి ప్రతిష్టలు గడించారు. జీవితాంతం భాగవత చింతన తోనే గడుపుతూ 5 దశాబ్దాలుగా పలు వేదికలపై అద్భుత ప్రవచనాలు చేసిన మహానుభావుడు, కర్మ యోగి గుండి రాజన్న శాస్త్రి. ఆబాల గోపాలాన్ని పరవశింపజేసే శాస్త్రి ప్రవచనాలకు దేశవిదేశీయులు సైతం అభిమానులయ్యారు. అపరశుక, వాల్మీకి, వ్యాసునిగా ప్రసిద్ధిగాంచిన ఆయన పాలరాతి విగ్రహాన్ని ధర్మపురిలో నెలకొల్పారంటే శాస్త్రి గొప్పతనం అర్థం చేసుకోవచ్చు.

**జీవిత విశేషాలు**

గుండి లక్ష్మీనరసింహ ఘనాపాటీ, లక్ష్మీ నర్సమ్మ దంపతులకు 9,12.1898లో జన్మించిన శాస్త్రి గుండి పాపయ్యశర్మకు దత్త పుత్రుడయ్యాడు. ఉర్దూ మాద్యమంలో ప్రాథమిక విద్య, సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యం వొరుఘల హన్మంతయ్య సిద్ధాంతి వద్ద లీలావతి గణితం, లౌకిక విద్యలు, తండ్రి వద్ద వేదాధ్యయనం మంథెన గట్టు కృష్ణమూర్తి వద్ద వేదాంగాలు, ఉపనిషత్తులు, ప్రస్తాన త్రయం, శాస్త్రాధ్యయనం, ఇతిహాస పురాణాదులలో శిక్షణ పొందారు. భార్య పేరు గుండమ్మ, ఆయనకు నలుగురు కుమారులు ఒక కుమార్తె కలిగారు. భాగవత, శ్రీవైష్ణవ సంప్రదాయానికను గుణంగా ముకుందుడు, రఘురాముడు, అచ్యుతుడు, గోవిందుడు, హరిప్రియ అని నామకరణాలు చేశారు. మూర్తీభవించిన భాగవతంగా పేరొందిన నవయోగీంద్ర భిక్షుగీత, ఉద్ధవ బోధనలు, రుక్మిణీ కల్యాణం గోపికాగీతాలు, కుంతి, భీష్మ, ధృవ, ప్రహ్లాద, గజేంద్ర బ్రహ్మస్తవరములు, ఇతిహాసాలు, మృదుమధురంగా ప్రవచించేవారు. ఇప్పటికీ ఆయనను అందరూ అవతార పురుషుడుగా, దైవాంశ సంభూతుడుగా, వ్యాసుడే భువిపైకి రాజన్న పేరుతో వచ్చాడని భావిస్తారు. ఆయన కులమతాలకతీతంగా కలిసిపోవడం, ధర్మపురిలో వారసంత నిర్వహణకు ప్రేరణ, బాలబాలికలను చేరదీసి సంస్కృతం మాట్లాడించడం, వితంతువులకు విద్య అవసరమని భావించి వారిని చదివించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. భూస్వాములు, దొరలు వస్తే వారిని తన ప్రవచనాలతో దాతలుగా మార్చేవారు. భాగవతంలో 18వేల శ్లోకాలు కంఠతా చదువుతూ అర్థతాత్పర్యాదులను వివరించ గలిగే అసాధారణ ధారణ శక్తి కలవారు. శాస్త్రి పాలరాతి విగ్రహాన్ని గోదావరి నది వద్ద శ్రీరామ ఆలయ సమీపంలో తాడూరి బాలకృష్ణ మహోపాధ్యాయుడు తన సొంత స్థలంలో ఆవిష్కరింప జేశారు. గుంటూరు వాసులు సంగా వెంకటనారాయ శర్మ ఆదిలక్ష్మీ దంపతులు, పెద్దపల్లి, కరీంనగర్ లో జరిగిన ప్రవచనాల్లో శాస్త్రి ప్రవచనాలను 2005లో శాస్త్రి కుమారుడు రామచంద్రుడు టేపులను సీడీలు, క్యాసెట్లుగా రూపొందించారు. ఇందులో ఉప్పుల రాధాకృష్ణ కృషి చాలా ఉంది. పలుమార్లు కాశీలో కూడా ప్రవచనం చేసిన శాస్త్రిచే కరీంనగర్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో మంగళంపల్లి మురహరిశర్మ భాగవత సప్తాహం చేయించారు. శాస్త్రి ప్రవచనాలను 50 మంది లబ్ద ప్రతిష్టులు, శాస్త్రి బంధువులు రాసిన అభిప్రా యాలు, వ్యాసాలతో మనుమడు విష్ణుప్రసాద్ సతీమణి డాక్టర్ వారిజా రాణి సంపాదకురాలిగా, మరో మనుమడు గుండి విష్ణుప్రసాద్ ప్రేరణతో ఎం. శేషాచలం అండ్ కంపని "ఎమెస్కో" ఓ పుస్తకం ప్రచురించింది. ఇంకా ఎందరిదో కృషి ఫలితంగా ఈ మహనీయుని చరిత్ర వెలుగు చూసింది. 30 మే 1975లో 82వ యేట శాస్త్రి బ్రహ్మలీనులైనారు.

**శాస్త్రి ప్రతిభకు నిదర్శనాలు...**

1968లో జర్మనీ యువతి శాస్త్రిని సత్కరించి ప్రవచనాలను ఇంగ్లీషులో తర్జుమా చేయించుకొని సంస్కృతం నేర్చుకొంది. ఇంగ్లాండ్ ఎంపీ హ్యూస్ బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధిగా వచ్చి ప్రవచానాన్ని విని భారత దేశ ధార్మిక ప్రవృత్తి గొప్పదని కొనియాడారు. ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు శంకుస్థాపన చేయగా వేలాది ఉభయ భాషా పండితులకు కల్పతరువై విరాజిల్లుతోంది. ప్రాక్పశ్చిమ ఉత్తర దక్షిణ యాత్రలను సంపూర్ణంగా కాలినడకన పూర్తి చేశారు. జిల్లాకు ఒకప్పటి ముస్లిం కలెక్టర్‌కు ఉర్దూ పారశీక భాషల్లో భాగవత శ్లోకాలు అర్థతాత్పర్యాదులతో వివరించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత మాజీ ముఖ్య మంత్రులు బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య, కెవీ కేశవులు, కవిసామ్రాట్ విశ్వనాథ, జువ్వాడి గౌతంరావు, జువాడి చొక్కారావు, తెన్నేటి విశ్వనాథం, కాసుగంటి నారాయణ రావు, దివాకర్ల వెంకటావధాని, జువ్వాడి రత్నాకర్ రావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, వానమమాలై వరదాచార్యులు, మల్లాది, మార్కండేయశాస్త్రి, వేమూరి లక్ష్మీ నరహరి శాస్త్ర, వంటివారు ఆయన పురాణానికి శ్రోతలుగా పలు సందర్భాలలో శాస్త్రి స్వగృహానికి ఎతెంచి పురాణ శ్రవణం చేసి, పలు సందేహాలు నివృత్తి చేసుకున్నారంటే గొప్పతనం కాక మరేమిటి. కరపాత్ర స్వామీజీ, శృంగేరీ, కంచి, కామకోటీ, పుష్పగిరి పీఠాధిపతులు, మధ్వ పీఠాధిపతులు, తలపాక మహారాజు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి వంటి వారు ధర్మపురిని సందర్శించినపుడు శాస్త్రి ప్రవచనాలు విని అభినందించి సన్మానించారు. కరీంనగర్ కాంగ్రెస్ కురు వృద్దులు మాజీ ఎంపీ, మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు ఇల్లు కట్టిస్తా నన్నా, కాసుగంటి నారాయణరావు కొండగట్టు పై 200 ఎకరాల భూమిని రాసిస్తానన్నా, మానకొండూర్ సర్పంచ్ సదాశివరావు తన భూమినంతా దానం చేస్తానన్నా, నాయకులు రాష్ట్రపతి పురస్కార మిప్పిస్తా మన్నా సున్నితంగా తిరస్కరించిన ఉదాత్తుడు రాజన్న శాస్త్రి.



**రామ కిష్టయ్య సంగన భట్ల**
**944059549**

# ఉత్కంఠ...

ఉత్కంఠ.. ఉత్కంఠ ..
ప్రతిచోట ఉత్కంఠ
గెలుపు ధీమాతో
డాంభికాలు పలుకుతూ..
మనసులో భయపడుతూ...
ఎండ వేడిమిటి తట్టుకోలేక
చల్లని ప్రాంతాలకు వెళ్లిన అభ్యర్థులు..
ఫలితాలు ఎలా ఉంటాయో ఏమవుతాయో అనే ఆందోళన..
సర్వేల మాయాజాలంలో పడి
అనుకూలంగా ఉన్న సర్వేలను
చూసుకుంటూ మురిసిపోతున్న అభ్యర్థులు...
ఏ నలుగురు ఒక చోట చేరిన
రాబోయే ఫలితాల గురించే...
ఈ పార్టీ గెలుస్తుంది
లేదా ఆ పార్టీ గెలుస్తుంది అనే
పందెం రాయుళ్ల పందేల జోరు...
పందేం జోలికి వెళ్లి ఉన్న డబ్బులు పోగొట్టుకోకండి!
గెలుపు ఓటములు సహజం
ప్రతి ఒక్కరూ వాటిని సమానంగా స్వీకరించాలి!
గెలిచినవారు ఓడిన వారిని హేళన చేయడం
రెచ్చగొట్టడం వంటివి చేయకూడదు!
ఓడినవారు అసూయతో గెలిచిన వారితో
గొడవలకు దిగటం వంటివి మంచిది కాదు!
క్షణికావేశాలకు పోయి మీ ఇంట్లో
మీ మీద ఆధారపడ్డ వారికి
అన్యాయం చేయకండి
ఏం జరిగినా మన మంచికే
అనుకుంటే అంతకు మించిన ఆనందం మరి ఇంకేముంటుంది?

**- ఏడుకొండలు కళ్ళేపల్లి,**
**మచిలీపట్నం, 9490832338**

# దేవాలయ నిర్మాణానికి ఎన్ఆర్ఐ వల్లపురెడ్డి రాం రెడ్డి భారీ విరాళం

**బీరప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ.1,16,000 విరాళం**





**ధర్మసాగర్ 29 మే (ప్రజామంటలు):** నారాయణగిరి గ్రామంలో గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వల్లపురెడ్డి రాం రెడ్డి భారీ విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా రూ. 1,16,000 ( ఒక లక్ష పదహారు వేల రూపాయలు) లు అందించారు. ఈ మేరకు బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాలన్ని అందించారు. ఈ సందర్భంగా దాతలు రాం రెడ్డిని, వారి తల్లిదండ్రులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి- రమాదేవి (ఎంపీటీసీ) దంపతులకు ఆలయ నిర్మాణం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు సభ్యులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి బోనాల జాతర

**పాల్గొన్న ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**





**జగిత్యాల మే 29 (ప్రజామంటలు):** పట్టణములోని వాణి నగర్,బీట్ బజార్,పురాణి పెట్ గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో ఉప్పరీ పెట్ జగిత్యాల పెద్ద చెరువు వద్ద గంగమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. ఈ సందర్భం గా సంఘం సభ్యులు ఎమ్మెల్యే ని శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జుంభర్తీ రాజ్ కుమార్, ఎఫ్ సిఎస్ ఛైర్మెన్ అంజయ్య, ఎఫ్ సిఎస్ డైరెక్టర్ ఆరుముల్ల పవన్, పాక్స్ డైరెక్టర్ గంగారం, ఎల్ల రాజన్న, నాయకులు దామోదర్ రావు, ఆనంద్ రావు, చందా పృథ్వి, ప్రవీణ్ రావు, శంకర్, రాజేశ్వర రావు, రాజేష్, డాన్ శ్రీను, క్రాంతి, కోటేశ్వర రావు, తరుణ్, గంగా పుత్ర సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిన్నింటి వాసాలు లెక్కపెట్టే వారిని వదిలి పెట్టేది లేదు



**జమ్మికుంట మే 29 (ప్రజామంటలు):** హుజూరాబాద్ నియోజకవర్గంలోని కొందరు వ్యక్తులు మేము కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ అన్న మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా నీచమైన పనికి మాలిన చర్య తిన్నింటి వాసాలు లెక్కపెట్టే ఏ ఒక్క ఇంటి దొంగను ఇడిచిపెట్టేది లేదు. అధిష్టానం నిర్ణయం మేరకు నియోజకవర్గంలో ఏ ఆపతి ఉన్న నేను ఉన్న మీకు అంటూ అందుబాటులో ఉండే ప్రణవ్ మీద పనికి మాలిన మాటలు మాట్లాడటం పిరికి పందల చర్య. ఇలాంటి తప్పుడు ప్రచారాలు మరలా పునరావృతం అయితే ఖబర్దార్. ఇటువంటి మాటలను మా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా తరుపున ఖండించడం జరుగుతుంది అని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డికోనేటర్ మిడిదొడ్డి రాజు పేర్కొన్నారు. ఎప్పటికైనా హుజురాబాద్ గడ్డ ప్రణవ్ అన్న అడ్డ అని మిడిదొడ్డి రాజు అన్నారు.



**జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం చెరువులో నిన్న సాయంత్రం ఈతకు వెళ్లి గల్లంతైన వాణీ నగర్ కు చెందిన పల్లె శ్రీనివాస్ కుమారుడు పల్లె అభిషేక్ డిగ్రీ 2వ సంవత్సరం చదువుతున్న యువకుడి మృతదేహం లభ్యం**



**శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గత 5 రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న జగిత్యాల మున్సిపల్ ఛైరపర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ కు స్వామి వారి శేషవస్త్రం సమర్పించి ఆశీర్వదించిన ఆలయ అర్చకులు.**

# ఏడాదిగా డైట్ బిల్లులు రాక కాంట్రాక్టర్ల కష్టాలు

**- రాష్ట్ర వ్యాప్తంగా రూ 40 కోట్ల బిల్లులు పెండింగ్**

**- చాలా కాలంగా బిల్లులు రాక పేషంట్ల భోజనంపై ప్రభావం - ప్రభుత్వానికి మొరపెట్టుకున్న కాంట్రాక్టర్లు**

**సికింద్రాబాద్ మే 29 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ బోధన ఆసుపత్రుల్లో పేషంట్లు, డ్యూటీ డాక్టర్లకు బోజనం అందించే డైట్ క్యాంటీన్ల నిర్వాహకులకు సంబందించిన బిల్లుల డబ్బులు గత ఏడాదిగా రాక డైట్ కాంట్రాక్టర్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా తాము వడ్డీకి అప్పులు తీసుకొచ్చి, డైట్ క్యాంటీన్లను నడుపుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు తెలంగాణ హస్పిటల్స్ డైట్ క్యాంటీన్స్ సప్లయిర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు కాంట్రాక్టర్లు బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తో పాటు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీఎంఈ డా.ఎన్.వాణీ లకు వినతి పత్రం సమర్పించారు. దీర్ఘకాలికంగా బిల్లులు రాక ఇప్పటికే కోట్ల రూపాయల అప్పులు తెచ్చామని, ఇక తమ వలన కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన పెండింగ్ బిల్లులు చెల్లించాలని వారు మొరపెట్టుకున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు రూ 5 కోట్ల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని



డైట్ కాంట్రాక్టర్ రవికుమార్ వాపోయారు. అలాగే ఉస్మానియా ఆసుపత్రి, పేట్ల బుర్జు మోడ్రన్ మెటర్నటీ ఆసుపత్రులకు సంబందించిన డైట్ బిల్లులు గత ఏడాది సెప్టెంబర్ నుంచి రావాల్సి ఉంది. నిలోఫర్ ఆసుపత్రికి గత 10 నెలల నుంచి, సంగారెడ్డి జీజీహెచ్ గత 8 నెలలు, జీజీహెచ్ సూర్యాపేట గత 6 నెలలు, ఎంజీఎం వరంగల్ గత ఆరు నెలల డైట్ బిల్లులు రావాల్సి ఉంది. ఇలాగే ప్రభుత్వం డైట్ క్యాంటీన్ల పెండింగ్ డబ్బులు చెల్లించడంలో ఇంకా జాప్యం చేస్తే, కొద్ది రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేషంట్లు, డ్యూటీ డాక్టర్లకు బోజనం నిలిచిపోయే అవకాశం ఉందని సమాచారం. ఇంకా కొత్తగా అప్పులు తెచ్చి డైట్ క్యాంటీన్లు నడపడం అసాద్యం అయ్యే క్రమంలో రాష్ట్రంలోని బోధన ఆసుపత్రుల్లో డైట్ క్యాంటీన్లు మూత పడి, అటు పేషంట్లు, ఇటు డ్యూటీ డాక్టర్లు పస్తు ఉండే ప్రమాదం ఉంది. ఇక ప్రభుత్వమే చొరవ తీసుకొని దీన్ని తప్పించాలని పలువురు కోరుతున్నారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న డైట్ కాంట్రాక్టర్ల బిల్లులు ఇప్పటికైన చెల్లించాల్సిన అవసరం ఉంది.

# రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మోతెలో ఉచిత వైద్యశిబిరం

**హాజరైన హైదరాబాద్ ప్రధాన కార్యాలయం కో ఆర్డినేటర్ స్వర్ణలత**

**జగిత్యాల రూరల్ మే 29 (ప్రజామంటలు):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మోతె గ్రామంలో మొబైల్ మెడికేర్ యూనిట్ నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పరిశీలించడానికి హైదరాబాద్ ఇండియన రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యాలయం కోఆర్డినేటర్ స్వర్ణలత హాజరయ్యారు ఆమెతో పాటుగా ఈ వైద్య శిబిరంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని వాణిశ్రీ ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం కోఆర్డినేటర్ స్వర్ణలత మాట్లాడుతూ.... జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ మార్గదర్శకంగా ఉందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సామాజిక సేవా కార్యక్రమంలలో భాగంగా గత 11 నెలలుగా మొబైల్ మెడికేర్ యూనిట్ నిర్వహణతో రాష్ట్రంలోని 16 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అంతేకాకుండా ఈ



ఉచిత వైద్య శిబిరంలో వృద్ధులు, దివ్యంగులు, ట్రాన్స్ జెండర్ లకు వైద్య

పరీక్షలు నిర్వహించడంతో పాటుగా ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నామన్నారు. అంకితభావంతో మొబైల్ మెడికేర్ యూనిట్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందిని నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ శిబిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు మహిళా సాధికారత విభాగం సచి విభాగం మహిళలు పాల్గొని అవగాహన కార్యక్రమం చేపడుతుండడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ వైద్య శిబిరంలో 60 మందికి పైగా వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ పూర్వాధ్యక్షుడు టీవీ సూర్యం, రెడ్ క్రాస్ కరీంనగర్ చైర్మెన్ కేశవరెడ్డి, డాక్టర్ కృష్ణ చైతన్య తో పాటుగా మోతె గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ మరియు మాజీ సర్పంచ్ సురేందర్ రావు, జిల్లా మహిళా సాధికారత బృందం అశ్విని, గౌతమి, సఖి సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి

**మాజీ మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**జగిత్యాల మే 29 (ప్రజామంటలు):** ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాల పంట ఎండిపోయిన పరిస్థితి అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ అన్నారు.మోతే రోడ్డులో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.... గత ప్రభుత్వంలో ఎలాంటి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. వడ్లలో కటింగ్ పేరుతో గత ప్రభుత్వము పై ఆరోపణలు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతుల ధాన్యానికి కటింగ్ ఎందుకు విధిస్తున్నారో తెలుపాలని డిమాండ్ చేశారు. దీనిలో రైస్ మిల్లర్లతో మీ వాటా ఎంతో చెప్పాలి అని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇస్తామన్న పదివేల నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. మధ్యాహ్నం భోజనం పథకంలో రెండు లక్షల 20 వేల టన్నుల బియ్యం 45 రూపాయల చొప్పున కాకుండా 57 రూపాయలకు టెండర్ ఖరారు చేసి కొనుగోలు చేయడం పెద్ద స్కాం అన్నారు. ఈ విషయంపై విప్ అడ్లూరి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రజలకు రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ జెడ్ పి టి సి సభ్యులు జలంధర్, నాయకులు అల్లాల దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, పాలేపు రాజేంద్ర ప్రసాద్, అల్లాల ఆనంద్ రావు, వొల్లెం మల్లేశం, కృష్ణ రెడ్డి, కర్థోజ్ గిరి, అలిశెట్టి వేణు, యం ఏ ఆరిఫ్, జంగిలి శశి, ప్రవీణ్ రావు, సంజీవ్, సంగెం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మా.. చల్లంగా చూడమ్మా..

**- ఘనంగా గంగమ్మ తల్లి బోనాలు**

**- బోనం ఎత్తుకున్న మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**



**జగిత్యాల మే 29 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం గంగమ్మ తల్లి బోనాల కార్యక్రమాన్ని ప్రత్యేక భక్తిశ్రద్ధలతో వండి కోరిన మొక్కులు తీర్చే కొంగు బంగారమైన గంగమ్మ తల్లికి జగిత్యాల పట్టణ పురవీధుల్లో ర్యాలీ గా వెళ్లి బోనం సమర్పించారు. పట్టణంలోని వాణీ నగర్, బీట్ బజార్, తులసీ నగర్ ప్రాంతాల నుంచి గంగపుత్ర సంఘం మహిళల ఆధ్వర్యంలో ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ మహిళలతో ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. డీజే పాటు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లిన మహిళలు గంగమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. బోనాల జాతరలో అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖంతోషాలతో ఆనందంగా ఉండాలని వర్షాలు సంవృద్ధిగా కురువాలని గంగమ్మ తల్లిని కోరుకున్నట్లు వారు తెలిపారు. గంగపుత్రుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## ఫెర్టిలైజర్ అండ్ సీడ్స్ షాపుల్లో తనిఖీలు



**గొల్లపల్లి మే 29 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వుల మేరకు గొల్లపల్లి మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ అండ్ సీడ్స్ షాప్ లో నకిలీ ఎరువులు విత్తనాల అరికట్టాలనే ఉద్దేశంతో మండల వ్యవసాయ అధికారి కరుణ ఎస్ఐ సతీష్ సంయుక్తంగా మండలంలోని పలు ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ షాపులను తనిఖీ చేశారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మకాలకు అదేవిధంగా అధిక రేట్లకు విక్రయించినట్లు అయితే రైతులు వెంటనే వ్యవసాయ అధికారి కాని లేదా పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని తెలిపారు. వారి పైన చట్టపరమైన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి కరుణ, ఎస్ఐ సిహెచ్ సతీష్ తెలిపారు.

## హెూంగార్డు కుటుంబానికి ప్రమాద భీమా చెక్కు అందజేసిన అదనపు ఎస్పి వినోద్

**జగిత్యాల మే 29 (ప్రజామంటలు):**




రూరల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందిన మహి ళ హెూంగార్డ్ రాధా కుటుంబానికి అదనపు ఎస్పీ వినోద్ కుమార్ బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో యాక్సిడెంటల్ డెత్ కింద మంజూరు కాబడిన ఇన్సూరెన్స్ 30,00,000 ముప్పై లక్షల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. రాధా కుటుంబానికి పోలీస్ శాఖ తరుపున పూర్తి సహకారం అందిస్తూ వారి కుటుంబానికి భరోసా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ ఎం.డి అక్బర్, ఆపరేషన్ మేనేజర్ కె. రామానుజ%శీ%, సేల్స్ మేనేజర్ ఎం.డి. సుఫియాన్, మరియు యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## చింతలపల్లి గ్రామంలో హనుమాన్ శోభయాత్ర



**ఎల్కతుర్తి మే 29 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి గ్రామంలో హను మాన్ మాలాదారులు గ్రామం లోని హనుమాన్ టెంపుల్ వద్ద నుండి హనుమాన్ వేషధారణలో శోభయాత్ర నిర్వహించడం జరిగినది. ఇట్టి శోభయాత్రను గ్రామ ప్రజలంతా ఎంతో ఆనందంతో మాలాదా రుల పాదాభివందనాలతో గ్రామ ప్రజలు ఆనందించారు.

# సరిహద్దు వెంబడి చైనా కుటిల యత్నాలు

## పుట్టగొడుగుల్లా వెలిసిన సైనిక గ్రామాలు!

**అక్సాయ్ చిన్,మే29:** డ్రాగన్ కంట్రీ కంత్రి పనులకు అడ్డుకట్ట పడటంలేదు. ఎప్పుడూ ఏదో ఒక రూపంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ప్రపంచంలోని అనేక దేశాలు చైనాపై గూఢచర్యం, హ్యాకింగ్ ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. మరోవైపు అరుణాచల్‌పై అడపాదడపా వాతం పట్టుకుని, మూర్ఛరోగిలా గిలాగిలా కొట్టుకోవడం చైనాకు అలవాటే పోయింది. నైన్టీన్ ఫిఫ్టీస్ తర్వాత హిందీ-చీనీ భాయిభాయి అంటూ చాచానెహ్రూ ఇచ్చిన నినాదం.. ఆ తర్వాత వన్‌సైడ్ లవ్వుగా మిగిలిపోయింది. రెండు దేశాల మధ్య 3500 కిలోమీటర్ల సరిహద్దు వివాదం కారణంగా 1962లో చైనాతో నేరుగా యుద్ధమే చెయ్యాల్సి వచ్చింది. టిబెట్‌తోపాటు అరుణాచల్ కూడా తమదే అంటూ తమ ఇంటర్నేషనల్ మ్యాపుల్ని చూపించేది. ఇక్కడ భారత దేశంలోనే అతిపెద్ద బౌద్ధ మందిరం ఉన్న తవాంగ్ ఉత్తర భాగం కూడా తమదేనని చెప్పుకునేది చైనా. 1962 యుద్ధంలో గెలిచినా తవాంగ్ నుంచి వెనక్కు వెళ్లిపోయింది చైనా. ఆ తర్వాత భారత్ ఈ ప్రాంతంపై పూర్తిగా పట్టు సాధించింది. అయితే తాజాగా భారత్‌తో సరిహద్దుకు సమీపంలో డ్యూయల్ యూజ్ గ్రామాలను నిర్మించడంలో చైనా బిజీగా ఉంది. ఇది కాకుండా, సైనిక సౌకర్యాల నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది కంత్రీ కంట్రీ. నిర్జనమైన, ఎవరు చేరుకోలేని హిమాలయాలలో, చైనా భారతదేశంతో తీవ్ర వివాదాస్పద సరిహద్దులో వందలాది గ్రామాలను నిర్మిస్తోందని వాషింగ్టన్ థింక్ ట్యాంక్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ (%జూ×ూ%) మే 16న ఒక కొత్త నివేదిక పేర్కొంది. జియోస్పేషియల్ డేటా ప్రొవైడర్ సెంటినెల్ హబ్ నుండి వచ్చిన ఉపగ్రహ చిత్రాలు 2022 %-% 2024 మధ్య దాని విస్తరణను చూపుతున్నాయి న్యూస్‌వీక్ పేర్కొంది. భారత్ విషయంలో చైనా తన దమననీతిని ప్రదర్శిస్తునే ఉంది. ఇటీవల విడుదల చేసిన 2023 ప్రామాణిక మ్యాప్‌లో మొత్తం అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం, అక్సాయ్ చిన్ ప్రాంతమంతా తమ భూభాగమని చైనా ప్రకటించుకుంది. ఆగస్టు 28న విడుదల చేసిన ఈ మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని దక్షిణ టిబెట్‌గా పేర్కొంది. 1962 యుద్ధంలో ఆక్రమించుకున్న అక్సాయ్ చిన్ ప్రాంతం తమదని చైనా పేర్కొంది. అంతే కాదు తైవాన్, వివాదాస్పద దక్షిణ చైనా సముద్రాన్ని కూడా తమ భూభాగమేనని మ్యాప్ ద్వారా చైనా చూపింది. చైనా సర్వేయింగ్, మ్యాపింగ్ పబ్లిసిటీ డే వేడుకల్లో భాగంగా చైనా ఈ మ్యాప్ విడుదల చేసింది. మరో వైపు అరుణాచల్ ప్రదేశ్ ఎప్పుడూ తమ భూభాగమేనని, అది ఎప్పటికీ అలాగే ఉంటుందని అనేక సందర్భాల్లో భారత్ స్పష్టం చేసింది. కానీ తాజాగా %జూ×ూ% నివేదిక ప్రకారం అరుణాచల్ ప్రదేశ్ సమీపంలోని నాలుగు వేర్వేరు ప్రదేశాలలో సైనిక, ద్వంద్వ వినియోగ గ్రామ మౌలిక సదుపాయాల విస్తరణను చేపట్టినట్లు వెల్లడించింది. ఇది యారోతో పాటు జువాంగ్నాన్, మజిదున్‌కున్, కుయికియోంగ్‌మెన్‌లలో సైనిక సౌకర్యాలను విస్తరించినట్లు వెల్లడించింది. అరుణాచల్ భారతదేశంలో అంతర్భాగమైన ప్రాంతం. అయితే చైనా దానిని తమ భూభాగంగా పేర్కొంటోంది. గ్రేజోన్ వ్యూహంతో సరిహద్దులో చైనా గ్రామాలను నిర్మిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు రహస్యంగా దూకుడు సైనిక దళాలను ఈ ప్రాంతంలో మోహరించవచ్చని హెచ్చరించారు. సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ 2018 %-% 2022 మధ్య, చైనా 624 'జియోకాంగ్' గ్రామాలను నిర్మించిందని, ఇక పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. భారత సరిహద్దులో సైనికుల మధ్య ఘర్షణ జరగడంతో ఉద్రిక్తత కొనసాగుతోంది. డిసెంబర్ 2020లో చైనా, భారత్ సైనికుల మధ్య యుద్ధం జరిగింది. 1962లో సరిహద్దు విషయంలో ఇరు దేశాల మధ్య యుద్ధం జరిగింది. గత మూడేళ్లుగా ఘర్షణలు కూడా పెరుగుతున్నాయి. సరిహద్దు వివాదానికి స్పష్టమైన పరిష్కారం లభించలేదని నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న సైనికీకరణ కారణంగా రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకుంటోంది. సరిహద్దు దగ్గర వేగంగా అభివృద్ధి చెందడం చైనా మౌలిక సదుపాయాల కల్పనకు నిదర్శనం. గతేడాది యారావో సమీపంలో కొత్త రోడ్డు, రెండు హెలిప్యాడ్‌లు కూడా నిర్మించారు. 3,900 మీటర్ల ఎత్తులో ఉన్న యారావోలో కఠినమైన వాతావరణ పరిస్థితులు ఉన్నందున, చైనా 2022 డిసెంబర్ నాటికి కొత్త భవనాలను నిర్మించగలిగిందని నివేదిక పేర్కొంది. టిబెటన్, హాన్ జనాభా కలయికతో చైనా సరిహద్దు ప్రాంతాలలో జనాభాను కూడా మారుస్తోందని నిపుణులు అంటున్నారు.

# నత్త నడకన నాసిరకంగా బ్రిడ్జ్ పనులు

### పట్టించుకోలేని జిల్లా అధికారులు



**వేలేర్ మే 28 (ప్రజామంటలు):**
వేలేరు మండల కేంద్రం నుంచి కొత్తకొండ దేవస్థానం వెళ్లే రహదారిలో ఉన్న బ్రిడ్జ్ పనులు నాణ్యత లేక నాసీ రకంగా జరుగుతున్నాయని ప్రయాణీకులు రైతులు చర్చించుకుంటున్నారు. అధికారులు వచ్చి పరిశీలించిన చర్యలు తీసుకుపోవడం గమనాదం జిల్లాలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఉన్నారా? అని వాపోతున్న ప్రజలు జిల్లా కలెక్టర్ నాణ్యత లేని పని చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు రైతులు డిమాండ్ చేస్తున్నారు గతంలో జిల్లా అధికారులకు గతంలో జిల్లా అధికారులకు దృష్టికి ఎన్నోసార్లు తీసుకుపోయిన ఎవరు పట్టించుకుంటలేరని అన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దు




**సికింద్రాబాద్ మే 29 (ప్రజామంటలు):**
బహిరంగ ప్రదేశాల్లో చెత్త, చెదారం వేసి పరిసరాలను అపరిశుభ్రం చేయవద్దని జీహెచ్ఎమ్సీ జాయింట్ కమిషనర్ రాజేందర్ రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం జీవీపీ ఎలిమినేషన్ ప్రొగ్రామ్ లో భాగంగా పద్మారావునగర్ స్కందగిరి టెంపుల్ సమీపంలోని సమోసా పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని, స్వచ్ఛ్ ఆటో లోనే చెత్తను వేయాలని సూచించారు. చెత్తను ఆరుబయట వేయడం, మూత్రవిసర్జన చేస్తే రూ 1000 వరకు జరిమానా వేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ దానా గౌడ్, సిబ్బంది గోవింద్ రాజు, యాదగిరి, నారాయణ, ప్రసాద్ రావు, వినోద్, రాజు పాల్గొన్నారు.

### తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాలలో

# అడ్మిషన్ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

### ప్రిన్సిపాల్ సంధ్యారాణి




**ఎల్కతుర్తి మే 29 (ప్రజామంటలు):**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలికల), ఎల్కతుర్తి యందు 2024-25 విద్య సంవత్సరానికి గాను పదకొండవ తరగతిలో ప్రవేశం కొరకై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. సంధ్య రాణి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ బీపీసీ కొరకు ఈ నెల 31 తేదీ వరకు రూ.100 రుసుము చెల్లించి వెబ్సైటు నందు దరఖాస్తు చేసుకోవాలి అని అన్నారు. 2023-24 వ సంవత్సరంలో 10వ తరగతి ఉతీర్ణులైన విద్యార్థులు అర్హులు. కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# కోతుల నడుమ క్రాస్ రోడ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**ఎల్కతుర్తి మే 29 (ప్రజామంటలు):**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతుల నడుమ క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది ఈ ప్రమాదం హనుమకొండ నుండి వేములవాడకు వెళుతున్న టి.ఎస్. 24 టి.ఏ 3273 నెంబర్ గల ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి కారు ను టి.ఎస్. 03 ఎఫ్.ఈ 5950 ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్నవారికి స్వల్ప గాయాలయ్యాయి చికిత్స నిమిత్తం హాస్పిటల్ కు తరలించారు. వీరు గోపాల్పూర్ గ్రామ వాస్తవ్యులుగా స్థానికులు తెలియజేశారు. కారు మొత్తం ధ్వంసం కావడంతో పూర్తిగా నష్టం జరిగిందని స్థానికులు వాహనదారులు తెలియజేశారు. బస్సు అతివేగం వల్ల ఆగి ఉన్న కారును ఢీకొనడం వలన ప్రమాదం జరిగిందని స్థానికులు తెలియజేశారు. చర్యలు తీసుకోవాలని నష్టపరిహారం చెల్లించవలసిందిగా స్థానికులు వాహనదారులు కోరారు.

# నిబంధనల మేరకే అనుమతి


**- సోమ్ డిస్టిలరీస్ కంపెనీ ఉత్పత్తులకు అనుమతి - కొత్త మద్యం బ్రాండ్లపై ఎటువంటి దరఖాస్తులు రాలేదు**
**- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి**



**హైదరాబాద్,మే29:** తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లపై రాజకీయ దుమారం రేగింది.. కొత్త మద్యం బ్రాండ్లకు రేవంత్ సర్కార్ అనుమతులు ఇచ్చిందంటూ బీఆర్ఎస్ నేతలు పలు విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో.. సోమ్ డిస్టిలరీస్ కంపెనీకి అనుమతులు ఇవ్వడం, కొత్త మద్యం బ్రాండ్లపై వస్తున్న విమర్శలపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. నిబంధనల మేరకే సోమ్ డిస్టిలరీస్ కంపెనీ ఉత్పత్తులను తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్‌కు సరఫరా చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు జూపల్లి కృష్ణారావు చెప్పారు. కొత్త మద్యం బ్రాండ్లకు సంబంధించి తమ దగ్గరకు ఎటువంటి దరఖాస్తులు రాలేదని ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే నాలుగేళ్ల కిందట కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇచ్చారంటూ వివరించారు. ప్రొసీజర్ ప్రకారమే బెవరేజెస్ కార్పొరేషన్ నిర్ణయాలు తీసుకుంటుందనీ, కార్పొరేషన్ రోజువారీ కార్యకలాపాలు తన దృష్టికి రావని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. కొత్త మద్యం బ్రాండ్లకు సంబంధించి తమ వద్దకు ఎలాంటి దరఖాస్తులు రాలేదని గతంలో ఓ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నట్లు జూపల్లి వివరించారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. నిర్ణయం తీసుకునే అధికారం బేవరేజెస్ కార్పొరేషన్‌కు ఉందని.. దాని ప్రకారమే అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. డిమాండ్ %-% సప్లైని బట్టి కొత్త కంపెనీలకు బేవరేజెస్ కంపెనీ అనుమతులు ఇస్తుందని గుర్తించాలని సూచించారు. సోమ్ డిస్టిలరీస్ రెండు దశాబ్దాలుగా.. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సరఫరా చేస్తోందని.. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనూ కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇచ్చారంటూ గుర్తు చేశారు. బేవరేజెస్ కంపెనీకి అనుమతులు ఇవ్వడంపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 2020-21 సంవత్సరంలో 50 లిక్కర్ బ్రాండ్లు, 5 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2021-22లో 75 లిక్కర్, 8 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2022-23లో 122 లిక్కర్ బ్రాండ్లు, 11 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2023-24లో 41 లిక్కర్ బ్రాండ్లు, 9 బీర్ బ్రాండ్ల కంపెనీలకు గత ప్రభుత్వం అనుమతులిచ్చిందంటూ మంత్రి జూపల్లి తెలిపారు.

# హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు

**- స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు - కౌంటింగ్ నిర్వహణపై నేతలతో టెలీకాన్ఫరెన్స్**



**అమరావతి,మే29:** విదేశ్ర పర్యట ముగించుకుని చంద్రబాబు నాయుడు హైదరాబాద్ చేరుకున్నారు. ఆయనకు శంషాబాద్ విమానాశ్రయంలో టిడిపి శ్రేణులు స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల పోలింగ్ తర్వాత సైలెంట్‌గా ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు తొలిసారి స్పందించారు. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి..? అనేదానిపై ఒకే ఒక్క మాటలో చెప్పేశారు. అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన చంద్రబాబు.. టీడీపీ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 31న 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజక వర్గాల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించ నున్నట్టు చంద్రబాబు తెలిపారు. బుధవారం అమెరికా నుంచి వచ్చీ రాగానే చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు కీలక అంశాలపై సూచనలు చేశారు. జూన్ 1వ తేదీన జోనల్ స్థాయిలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ రెండు కార్యక్రమాలకు వెంటనే ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. పోస్టల్ బ్యాలెట్‌ల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌లపై వెంటనే వైసీపీ చేస్తున్న రాద్ధాంతం పట్ల అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఓటమికి వైసీపీ నేతలు కారణాలు వెతుకుతున్నారని చంద్రబాబు అన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుల తీరుపై అందుకే విమర్శలు చేస్తున్నారని నేతలు చెప్పారు. కౌంటింగ్ రోజు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈసీకి, డీజీపీ కు లేఖ రాయాలని టీడీపీ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అబ్జర్వర్‌ను నియమించాలని టీడీపీ డిమాండ్ చేసింది. 175 నియోజకవర్గాలకు 120 మంది మాత్రమే పరిశీలకులను నియమించడం పట్ల టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే అన్ని నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించాలని లేఖ రాయాలని చంద్రబాబు నిర్ణయించారు. రేపు సాయంత్రం అమరావతికి చంద్రబాబు బయలుదేరనున్నారు. ఇదిలావుంటే టిడిపి అధినేత చంద్రబాబు విదేశీ పర్యటనను ముగించుకొని బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. ఏపిలో ఎన్నికల ప్రచారం, పార్టీ వ్యవహారాలతో బిజీగా గడిపిన చంద్రబాబు కొంతకాలం విశ్రాంతి కోసం ఈ నెల 19న విదేశాలకు వెళ్లారు.

# వారణాసిలో దక్షిణాది నేతల మకాం

**- మోడీకి అత్యధిక మెజార్టీ కోసం నేతల ప్రచారం - ప్రచారంలో బండి సంజయ్ తదితరులు**




**వారణాసి,మే29:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోటీ చేస్తున్న వారణాశి ఓ మినీ ఇండియా. అక్కడ దక్షిణాది రాష్ట్రాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున ఉంటారు. అక్కడే స్థిరపడి ఓటర్లుగా కూడా మారారు. వారందరితో మోదీకి వేయించేందుకు దక్షిణాది నుంచి బీజేపీ నేతలు పెద్ద ఎత్తున వారణాశికి వెళ్లారు. వారణాసి నియోజకవర్గంలో 18.50 లక్షల ఓట్లున్నాయి. వీరిలో దక్షిణాది ఓటర్లు కనీసం 3 లక్షల పై చిలుకే ఉంటారు. తెలుగు, తమిళ ఓటర్లు 2 లక్షల దాకా ఉంటారు. కన్నడ, మలయాళీలు లక్ష మంది ఉన్నారని అంచనా. కాశీలోనే దక్షిణాది రాష్ట్రాల నిర్వహణలో కనీసం 200 వరకు ఆశ్రమాలున్నాయి. ఇలా వారణాసిలో దక్షిణాది ఓటర్లు కీలకంగా మారారు. తెలుగు వారి ఓట్లు పూర్తి స్థాయిలో మోదీకే అనుకూలంగా పడేలా తెలుగు రాష్ట్రాల నుంచి బండి సంజయ్, విష్ణువర్ధన్ రెడ్డి సహా పలువురు నేతలు ప్రచారానికి వెళ్లారు. తెలుగు ఆశ్రమాల పెద్దలతో ఉదయం, సాయంత్రం బైఠక్‌లు నిర్వహించారు. గత డిసెంబర్ నుంచే తెలుగు, తమిళ సంగమం పేరుతో వారణాసిలో బీజేపీ పలు కార్యక్రమాలు నిర్వహించింది. మోదీ స్వయంగా సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. అక్కడి దక్షిణాది ప్రజలు మొదటి నుంచి బీజేపీకే అనుకూలంగా ఉన్నారు. అయితే ఈ సారి మోదీ మెజార్టపై ఎక్కువ దృష్టి పెట్టారు. గతంలో అరవై ఐదు శాతానికిపైగా ఓట్లు మోదీకి వచ్చాయి. ఈ ?సరి 80 శాతం ఓట్లను బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా దక్షిణాది వారి ఓట్లు అత్యధికంగా మోదీకే వచ్చేలా చూడాలని విస్తృతంగా ప్రచారం చేశారు. ÷-రతి 50 మంది ఓటర్లకు ముగ్గురు, నలుగురితో కూడిన బృందం చొప్పున పని చేసింది. ఒక్కో బృందం రోజుకు 4 నుంచి 5 సమూహాలతో భేటీలు నిర్వహించింది. ప్రచార గడువు ముగస్తూండటంతో.. అందరూ అయోధ్యను దర్శించుకుని వెనదిరుగుతున్నారు. మోదీ ఈ సారి కనీ వినీ ఎరుగని మెజార్టీతో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### అప్పుల బాధతో యువరైతు

# ఉరి వేసుకుని ఆత్మహత్య

**ఎల్కతుర్తి మే 29 (ప్రజామంటలు):**



హనుమకొండ జిల్లా మండలంలోని గోపాల్ పూర్ గ్రామంలో యువరైతు పెండ్యాల నాగరాజు (వయసు: 36) అప్పుల బాధతో వ్యవసాయ బావి వద్ద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగినది. ఇతనికి ఇద్దరు కూతుర్లు వయసు 5 లోపు వారే. కావున మృతుని కుటుంబాల ఫిర్యాదు మేరకు ఎల్కతుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువులు, గ్రామస్తులు శోకసముద్రంలో మునిగారు.

# బేటి బచావో బేటి పడావో పై అవగాహన కల్పించిన జిల్లా మహిళా సాధికారత సభ్యులు



**జగిత్యాల మే 29 (ప్రజామంటలు):**
అర్బన్ మోతె గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 1 గంటలకు అవగాహన కార్యక్రమం గ్రామ మహిళలకు బేటి బచావో బేటి పడావో పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం, డిస్టిక్ కోఆర్డినేటర్ అశ్విని, మాట్లాడుతూ మొదటగా బేటి బచావో బేటి పడావో పథకం గురించి, మహిళా హక్కుల గురించి మరియు సాధికారత గురించి మహిళలకు వివరించారు. తర్వాత బాల బాలికలకు బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టం గురించి అలాగే బేటి బచావో బేటి పడావో స్కీం గురించి, టోల్ ఫ్రీ నెంబర్స్ గురించి అలాగే సెల్ ఫోన్ వాడడం వల్ల వచ్చే నష్టాల గురించి, మరియు పిల్లలు లో వ్యక్తిగత వికాసం ఎలా పెంపొందించుకోవాలి అనేదాని అలాగే తల్లిదండ్రులను పిల్లలు సరిగా చూసుకోకపోవడం ఇబ్బందులకు గురిచేసిన టోల్ ఫ్రీ నెంబర్ కు చేసినట్లయితే వారికి సరియైన కౌన్సిలింగ్ ఇచ్చి ఇబ్బందులు లేకుండా చూడడం జరుగుతుందని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, డిస్టిక్ కోఆర్డినేటర్ అశ్విని, స్టాఫ్ హేమశ్రీ, సఖి లీగల్ కౌన్సిలర్ లావణ్య, కౌన్సిలర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీలు, ఎస్టీలు, ఒబీసీలకు

# అన్యాయం చేస్తోంది మోడీయే

**ఈడబ్లూఎస్ లో అన్ని వర్గాల ప్రజలకు అవకాశం కల్పిస్తాం.**
**పదేళ్ల పాలనలో మోడీ హిందూ సమాజానికి ఏవిధమైన మేలు చేయలేదు**
**ఎమ్మెల్సీ, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి**



**జగిత్యాల మే 29 (ప్రజామంటలు):**
జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ, నిజామాబాద్ ఎం పి అభ్యర్థి, తాటిపర్తి జీవన్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రధాని హెూదాలో సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా, మత విద్వేషాలు రెచ్చ గొట్టే లా మాట్లాడుతున్నారు. సమాజాన్ని చిల్చేలా ఓటు బ్యాంకు రాజకీయాలు చేసిదే భారతీయ జనతా పార్టీ అని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలపై మొసలి కన్నీరుకారుస్తూ అన్యాయం చేస్తోంది బిజెపి. సామాజికంగా వెనకబడిన వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను మోడీ కాలరాస్తున్నరు. ఆర్థిక వెనకబాటుతనం ఆధారంగా 103 రాజ్యాంగ సవరణ ద్వారా ఈడబ్లూఎస్ లో సామాజికంగా వెనకబడిన ఎస్సీ, ఎస్టీ, ఒబీసీలను తొలగించారు. బలహీన వర్గాల హక్కులు కాలరాసే విధంగా ఆర్థికంగా వెనకబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ లను ఈడబ్లూఎస్ రిజర్వేషన్ నుండి తొలగించారు. ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తుంది బిజెపి. ఈడబ్లూఎస్ కింద ఎక్కువగా ముస్లిం లే రిజర్వేషన్ పొందుతున్నారు. ఎస్సీ, ఎస్టీ లు, బీసీ లకు కాంగ్రెస్ అన్యాయం చేస్తుంది అంటూ అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తోంది నరేంద్ర మోడీ. కాంగ్రెస్ పార్టీ సామాజిక వెనకబాటు తనం పరిగణలోకి తీసుకొని రిజర్వేషన్ కల్పించింది అని గుర్తు చేశారు.

# అజ్ఞాతం వీడిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి

## నరసరావుపేటలో ప్రత్యక్షం..పోలీసుల ముందు హాజరు

**గుంటూరు,మే29:** మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అజ్ఞాతం వీడారు. పలు కేసుల్లో అరెస్ట్ కాకుండా మంగళవారం హైకోర్టు నుంచి పిన్నెల్లి ఉపశమనం పొందిన సంగతి తెలిసిందే. హైకోర్టు నుంచి ఉపశమనం లభించిన గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యే పిన్నెల్లి నరసరావుపేటలో ప్రత్యక్షమయ్యారు. మంగళవారం రాత్రి 9 గంటలకు నరసరావుపేట చేరుకున్నారు. స్థానికంగా ఓ హోటల్‌లో బస చేశారు. రాత్రి 12 గంటలకు ఎస్పీ మలికా గార్గ్ ఎదుట ఆయన హాజరయ్యారు. పాల్వాయిగేటు బూత్‌లో ఈవీఎం విధ్వంసం కేసు, టీడీపీ ఏజెంట్‌పై హత్యాయత్నం, అల్లర్లు, దాడుల కేసుల్లో పిన్నెల్లి నిందితుడిగా ఉన్నారు. ఈసీ ఆయన్ను అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించిన నేపథ్యంలో రెండు వారాల క్రితం పిన్నెల్లి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ూచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మంగళవారం హైకోర్టులో ఉపశమనం లభించింది. మరో మూడు కేసుల్లో అరెస్టు కాకుండా జూన్ 6 వరకు రక్షణ కల్పిస్తూ న్యాయస్థానం షరతులతో కూడిన మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రతి రోజు పల్నాడు ఎస్పీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 లోపు హాజరు కావాలని సూచించింది. నరసరావుపేట దాటి వెళ్లొద్దని, ఎక్కడ ఉంటున్నారో పల్నాడు ఎస్పీకి నిత్యం సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. దేశం దాటి వెళ్లొద్దని, పాస్‌పోర్టు అప్పగించాలని సూచించింది. గురజాల మేజిస్ట్రేట్ కోర్టులో పాస్‌పోర్టును అప్పగించాలని పిన్నెల్లిని ఆదేశించింది. కోర్టు విధించిన షరతులను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవచ్చని పోలీసులకు తెలిపింది. పిన్నెల్లి కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని న్యాయస్థానం ఆదేశించింది. ఏ విధమైన నేరకార్యకలాపాల్లో జోక్యం చేసుకోవద్దని, నేర ఘటనలను పునరావృతం చేయవద్దని పిన్నెల్లికి తేల్చి చెప్పింది. అలాగే జిల్లాలో శాంతి భద్రతల సమస్యలను సృష్టించొద్దని సూచించింది. అనుచరులను నియంత్రించే బాధ్యత పిన్నెల్లి తీసుకోవాలని తేల్చిచెప్పింది. కేసుల గురించి మీడియాతో మాట్లాడవద్దని స్పష్టం చేసింది. అలాగే బాధితులు, సాక్షులను ప్రభావితం చేయవద్దని సూచించింది.ఎట్టి పరిస్థితుల్లో నరసరావుపేటలో మాత్రమే ఉండాలని న్యాయస్థానం ఆదేశించింది. ఓట్ల లెక్కింపు కేంద్రం మరోచోట ఉంటే లెక్కింపు రోజు మాత్రమే అక్కడికి వెళ్లవచ్చని పేర్కొంది.ఎన్నికల సందర్భంగా పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై హత్యాయత్నం, చెరుకూరి నాగశిరోమణి అనే మహిళను తీవ్రంగా దుర్భాషలాడటం, కారంపూడిలో సీఐ టీపీ నారాయణస్వామిపై దాడి ఘటనల్లో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ ఇవ్వద్దని బాధితుల తరఫు న్యాయవాదులు వాదించారు.

ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాల్సిన అవసరం ఉందని పిన్నెల్లి తరఫు న్యాయవాది హైకోర్టులోవాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో జూన్ 6 వరకు బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. పిన్నెల్లి అరెస్ట్ విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని టీడీపీ నేతలు ఆరోపించారు. రోజుల తరబడి గాలిస్తున్నామని ప్రకటనలివ్వడమే తప్ప పిన్నెల్లిని అరెస్ట్ చేయలేదని విమర్శించారు. ఈవీఎం ధ్వంసం కేసులో హైకోర్టు నుంచి ఉపశమనం పొందినా.. హత్యాయత్నం కేసుల్లో అరెస్టు చేయాల్సి ఉన్నా.. పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

## ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు

### వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,మే29:** ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కేసులో బుధవారం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభవన్‌లో బాంబు పెట్టామని.. మరికొద్దిసేపట్లో పేలబోతుందంటూ ఓ వ్యక్తి మంగళవారం పోలీసులకు ఫోన్ చేశాడు. దాంతో అప్రమత్తమైన పోలీసులు ప్రజాభవన్‌కు చేరుకొని అణువణువు గాలించారు. రెండుగంటలకుపైగా తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పద వస్తువులు ఏవీ దొరకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అకతాయి పనిగా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి సదరు వ్యక్తి కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో నిందితుడు శివరామకృష్ణను పంజాగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం సేవించి డయల్ 100 కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసినట్లుగా గుర్తించారు. భార్యతో గొడవపడి మద్యం మత్తులో ఫోన్ చేసినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. శివరామకృష్ణ ముషీరాబాద్‌లో నివాసం ఉంటుండగా.. అతని స్వస్థలం గుంటూరు జిల్లాగా గుర్తించారు.

## మేడిగడ్డలో కొనసాగుతున్న మరమ్మత్తులు

**మహదేవపూర్,మే29 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ లక్ష్మి బరాజ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను బుధవారం భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు పర్యవేక్షించారు. పనుల తీరుపై అధికారులతో చర్చించారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన పియర్ ఖాళీ ప్రదేశాలతో గ్రౌటింగ్ చేసేందుకు ప్రారంభించిన బోర్ హోల్ పనులు, 20, 21 గేట్ కట్టింగ్, బరాజ్ దిగువన వరద ఉధృతితో ఎలాంటి ప్రభావం లేకుండా ఉండేందుకు ఇసుకలో కాపర్ షీట్ ÷ల్స్‌లను యంత్రాల సాయంతో అమర్చుతున్నారు. వరద నీటితో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బరాజ్ ఎనిమిదో బ్లాక్ వరకు వరద నీటి ప్రవాహం రాకుండా మట్టి కరకట్ట పనులు జరుగుతున్నాయి. బరాజ్ దిగువన సీసీ బ్లాక్ అమర్చుతున్నారు. అప్‌స్టీమ్, డౌన్ స్టీమ్‌లో వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుక, రాళ్లను తొలగిస్తున్నారు.

## ఉమ్మడి జిల్లాలో నకిలీ వైద్యుల గుర్తింపు

### పలువురిపై కేసులు నమోదు చేసిన అధికారులు

**నల్లగొండ,మే29:** నల్గొండ, సూర్యాపేట జిల్లాలో తెలంగాణ వైద్య మండలి సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం, నకిలీ వైద్య వ్యవస్థ ద్వారా వైద్య పరంగా.. ఎటువంటి విద్యార్హత లేకుండా పేద ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకొని నిలువు దోపిడీ చేస్తున్న వచ్చి రాని వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులను గుర్తించి చట్టం ప్రకారం తెలంగాణ వైద్య మండలి అధికారులు కేసులు నమోదు చేశారు. ఎటువంటి విద్యార్హత లేకుండా ఎంబీబీఎస్ వైద్యుల స్థాయిలో ఆర్‌ఎంపీ, పీఎంపీ అని బోర్డు పెట్టుకొని స్థాయికి మించి, పరిధి దాటి వైద్యం చేస్తున్న 55 మంది నకిలీ వైద్యులపై ఔఓఅ చట్టం 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నారు. వీరందరు ఎటువంటి విద్యార్హత లేకుండా విచ్చలవిడిగా ఆంటిబయోటిక్, స్టెరాయిడ్ ఇంజక్షన్, కొన్ని సెంటర్లలలో గర్భ విచ్చిత్తి టా÷-లబెట్స్, ఆపరేషన్ థియేటర్స్, రహస్య గర్భ విచిత్తి సంబంధిత పరికారాలను గుర్తించారు. కాగా.. నకిలీ డాక్టర్లపై తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి చర్యలు చేపట్టింది. ఎలాంటి అర్హత లేకుండా చాలా మంది వైద్యులుగా చలామణి అవుతున్న క్రమంలో సీరియస్ యాక్షన్ తీసుకుంటుంది. ఇప్పటికే హైదరాబాద్ లో పలుచోట్ల నకిలీ క్లినిక్ లపై అధికారులు సోదాలు చేపట్టారు. తాజాగా.. నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో సోదాలు నిర్వహించారు.

## పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### లోయలో పడిన బస్సు

### 28 మంది మృతి, 22 మంది తీవ్ర గాయాలు

**బలూచిస్థాన్ ప్రావిన్స్,మే29:** పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు లోయలో పడిన ఘటనలో 28 మంది మృతి చెందగా, మరో 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అందులో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందినవారి దేహాలు అక్కడే పడి ఉన్నాయి. బలూచిస్థాన్ ప్రావిన్స్ వద్ద భారీ లోయలో పడిపోయింది బస్సు. టుర్బాట్ నుంచి క్వెట్టాకు బస్సు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. వేగంగా వెళ్లడమే ఈ ప్రమాదానికి కారణమని అంచనా వేస్తున్నారు అధికారులు. చనిపోయినవారిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ సిబ్బంది ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాలను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సు అతి వేగంగా వెళ్తున్న సమయంలో టైరు పంక్చర్ కావడంతో ఘటన జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

## సైబర్ నేరగాళ్ల దూకుడు

### ఏకంగా ఎస్పీ పేరుతో ఫేక్ అకౌంట్

**సూర్యాపేట,మే29:** సైబర్ నేరగాళ్లు ఏకంగా 'ఎస్పీ సూర్యాపేట' పేరుతో ఫేస్‌బుక్ అకౌంట్ ఓపెన్ చేశారు. పోలీసులను బురిడీ కొట్టించడానికి ఏకంగా ఎస్పీ పేరునే వాడుకున్నారు. సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే పేరుతో నకిలీ ఫేస్‌బుక్? అకౌంట్‌ను సైబర్‌నేరగాళ్లు ప్రారంభించారు. ఆ ఆ అకౌంట్ నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పలువురి ఎస్‌ఐ, సీఐలు, ప్రముఖులకు నకిలీ ఫేస్?బుక్? ఖాతా ద్వారా ఎస్పీ రాహుల్ హేగ్డే పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఎస్పీ కదా అని చాలా మంది రిక్వెస్ట్ ఒకే చేస్తున్నారు. కొద్దీ సేపటికే మెస్సెంజర్?లో చాటింగ్ ప్రారంభించి 'మీతో ఓ అవసరం పడింది. కొంత మొత్తం నగదు కావాలి.. ఫోన్ పే చేస్తే రేపే తిరిగిచ్చేస్తా.. అంటూ మెసేజ్ చేస్తున్నారు. అనుమానంతో కొంత మంది పోలీసులకు, ఎస్పీకి సమాచారం అందించారు. వెంటనే ఎస్పీ అప్రమత్తమయ్యారు. 'ఎస్పీ సూర్యాపేట' ఖాతా నుంచి వచ్చే మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని కోరారు. తన పేరుపై ఉన్నది ఫేక్ ఖాతా అని, అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ డబ్బులు పంపించవదద్దని ఎస్పీ ప్రకటన విడుదల చేశారు.

## పిల్లల అమ్మకాలపై దర్యాప్తు ముమ్మరం

### - ఇతర రాష్టాల్లో మూలాలపై కూపీ - పిల్లలను వదిలి ఉండలేమంటూ బాధితులు రోదన

**హైదరాబాద్,మే29:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా యాక్టివిటీస్ ఇతర్రాష్ట్రాల్లో కూడా ఉన్నట్టు పోలీసుసు అనుమానిస్తున్నారు. ఆ దిశగా రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంకా ఏ యే రాష్ట్రాల్లో ఈ ముఠా కార్యకలాపాలు చేపట్టిందో ఆరా తీస్తున్నారు. ప్రస్తుతానికి ఓ బృందం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. చైల్డ్ ట్రాఫిక్ కేసులో ఇప్పటి వరకు అరెస్టు చేసిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఈ కేసులో కిరణ్, ప్రీతిదే కీలక పాత్రగా అనుమానిస్తున్నారు. వాళ్ల కోసం వేట మొదలు పెట్టారు. 50 మందికిపైగా చిన్నారులను విక్రయించినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వీరిలో 16 మందిని గుర్తించారు. ఇంకా మిగతా వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పిల్లల్ని కొనుగోలు చేసిన తల్లిదండ్రులపై కేసులు పెట్టడం ఇక్క మరో ట్విస్టు. దీంతో ఆ ఫ్యామిలీలు బోరున విలపిస్తున్నాయి. తెలిసో తెలియకో పిల్లలు లేరని బెంగతోనో చిన్నారులను కొనుక్కున్నామని వాపోతున్నారు. ఇన్ని రోజులు పెంచుకున్న మమకారంతో వారిని విడిచి పెట్టలేక పోలీస్‌స్టేషన్ వద్దే కన్నీరు మున్నీరుగా విలపించారు. తాము ఆ బిడ్డల్ని కనకపోయినా కడుపులో పెట్టుకొని అంతకంటే ఎక్కువగా పెంచుకున్నామని అంటున్నారు. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న చిన్నారులను దూరం చేయొద్దని వేడుకుంటున్నారు. సంతానం లేక ఇబ్బంది పడుతున్న ఫ్యామిలీలు పిల్లల కోసం లక్షలు వెచ్చించారు. ఏదో రూపంలో ఇంట్లోకి పిల్లలు వస్తున్నారన్న



ఆనందంతో తప్పులు చేస్తున్నారు. పిల్లల్ని ఇలా దత్తత తీసుకోవాలంటే దానికో నియామవళి ఉంది. అప్పుడే అధికారులు దాన్ని గుర్తిస్తారు. ఇలా ఎవరి వద్ద పడిదే వాళ్ల వద్ద కొంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. ఇలా పిల్లల్ని కొనుగోలు చేస్తున్న వారిలో చాలా మంది ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉన్నవాళ్లు ఉన్నారు. ఇలాంటి వాళ్లు కూడా అప్పులు చేసి డబ్బులు చెల్లించి పిల్లల్ని కొంటున్నారు. ఇలాంటి ముఠాల్లో ఆర్‌ఎంపీలు, ఆసుపత్రుల్లో పని చేసే సిబ్బంది పాత్ర ఎక్కువగా ఉంటోంది. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన కేసులో కూడా నిందితులుగా ఆరఎంపీలు, ఇతర ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు. శోభారాణి అనే ఆర్‌ఎంపీ ఈ విక్రయాలు జరుపుతున్నట్టు గుర్తించి చెక్ పెట్టారు.

## పవర్ ప్రాజెక్టుల పేరుతో భూ సంతర్పణ

### - ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టగానే విచారణ - బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్

**విశాఖపట్నం,మే29:** పవర్ ప్రాజెక్టుల పేరుతో భూ సంతర్పణ చేశారని..జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్, ఇండోసోలార్ సంస్థలకు భారీఎత్తున భూములు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంవోయూలు చేసుకోకుండా జీవోలు ఇచ్చిన ఘనత జగన్ సర్కారుదేనని, తన అస్మదీయులకు భూసంతర్పణ చేస్తూ.. రాష్ట్రాన్ని గుల్ల చేస్తున్నారని మండిపడ్డారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకుని డి పట్టాభూమలను బదలాయించుకున్నారని విమర్శించారు. జూన్ 4న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాబోతోందని, భూములపేరుతో జరిగిన అవినీతి, అక్రమాలపై దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతామని లంకా దినకర్ అన్నారు. సీఎస్ తనయుడు పేరు మీదే భూ దోపిడీలు జరుగుతున్నాయని, సీఎం జగన్ 4 లక్షల ఎకరాల భూమిని అస్మదీయులకు కట్టబెట్టారని ఆరోపించారు. షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు క్విడ్ ప్రోకోతో భూములను కట్టబెట్టారన్నారు. ఏక్సస్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ ఆగడాలను కూడా ప్రశ్నించామని, దీనిపై ఈఆర్సీ అడ్డుకట్ట వేసిందన్నారు. కర్నూల్, అనంతపూర్, కడప జిల్లాల్లో 32 వేల ఎకరాలను షిరిడీసాయి, ఇండో సోలార్ కంపెనీలకు నామమాత్రపు ధరకు ధారాదత్తం చేశారని విమర్శించారు. ఏ మాత్రం అనుభవం లేని సంస్థలతో ఎంవోయూలు ఎలా చేసుకున్నారు?.. రూ. 500 కోట్లు మించి టర్నోవర్ లేని సంస్థలకు వేల కోట్ల భూమలను ఎలా కట్టబెడతారు?.. దీనిపై ఆడిట్ చేయాలని లంకా దినకర్ డిమాండ్ చేస్తున్నారు. ఇటు వంటి కంపెనీలు భూములు విలువ ఆధారంగా మూల్యాంకణం ఎక్కువగా చూపించి అంతర్జాతీయ విపణిలోకి ప్రవేసించే ప్రమాదం వుందన్నారు. అధిక పెట్టుబడులను ఆకర్షించే భారీ ఆర్థిక మోసాలకు తెరలేపే ప్రమాదం వుందని, ప్రాజెక్టు అనుమతులకోసం చేసిన అకృత్యాలను రాబోయే ప్రభుత్వం నిగ్గుతేల్చాలన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, మీటర్లు , పోల్స్ రాబోయే ఐదేళ్లకు అత్యధిక ధరలకు సరఫరా చేసే ఒప్పందాన్ని ఎలా కుదుర్చుకున్నారని లంకా దినకర్ జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

## ఢిల్లీకి తాగునీటి కష్టాలు

### - నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా - ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,మే29:** దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తాజాగా బుధవారం అత్యంత స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 52.3 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఢిల్లీ అగ్నిగుండలా మారింది. బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇదొక పెద్ద సమస్యగా ఉంటే.. తాజాగా మరో కొత్త సమస్య హస్తినను వెంటాడుతోంది. తాగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి దాకా బెంగళూరు నీటి సమస్యతో చాలా ఇక్కట్లు పడింది. ఇప్పుడు ఢిల్లీ వంతు వచ్చింది. ప్రజలు కనీస అవసరాలకు నీళు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజులుగా నీటికొరత వేధిస్తుండటంతో ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించింది.నీటి పైపులతో కార్లను కడగడం, వాటర్ ట్యాంకర్లు ఓవర్ ఫ్లో కావడం, వాడుక నీటిని నిర్మాణ, వాణిజ్యపరమైన అవసరాల కోసం వినియోగించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు మంత్రి అతిషి ఆదేశించారు. ఇందుకోసం ఢిల్లీ వ్యాప్తంగా 200 బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించనున్నట్లు మంత్రి అతిశీ తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి బృందాలను రంగంలోకి దించేలా చర్యలు చేపట్టాలని ఢిల్లీ జల్‌బోర్డు సీఈవోకు రాసిన లేఖలో అతిశీ పేర్కొన్నారు. నిర్మాణ స్థలాలు, వాణిజ్య సంస్థల్లో ఏవైనా అక్రమ నీటి కనెక్షన్లు ఉంటే తొలగించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వ కుట్రతో తాగునీటి కష్టాలు వచ్చాయని ఢిల్లీ పోలింగ్‌కు ముందు మంత్రి అతిషి ఆరోపించారు. హర్యానా సర్కార్‌తో కుట్ర పన్ని తాగునీటి కష్టాలు కేంద్రం రప్పించిందని ఆమె పేర్కొన్నారు. ఇక హర్యానా నుంచి తమకు రావాల్సిన నీటి వాటా కోసం ఆప్ సర్కార్ పోట్లాడుతుందని మంత్రి తాజాగా వెల్లడించారు.

## కంటైనర్‌లో ఊపిరాడక 15 గోవుల మృత్యువాత

### సూర్యాపేట వద్ద అడ్డుకుని పట్టుకున్న పోలీసులు

**సూర్యాపేట,మే29:** అక్రమంగా గోవులను తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఆవులను కంటైనర్‌లో తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. సూర్యాపేట నుంచి ఏపీ వైపు వెళ్తుండగా సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చెక్‌పోస్టు వద్ద కంటైనర్ పట్టుబడింది. కంటైనర్‌ను పోలీసులు తనిఖీ చేశారు. కంటైనర్ లో మొత్తం 26 ఆవులు ఉన్నట్టు గుర్తించారు. అందులో ఊపిరాడక 15 ఆవులు మృతి చెందినట్టు నిర్ధారించారు. తొమ్మిది ఆవులను నల్గొండ గోశాలకు తరలించారు.ఆవులను పల్నాడు జిల్లా గురజాలకు చెందినవిగా గుర్తించారు. రెండు ఆవులకు కాళ్లు విరగడంతో చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన ఆవులకు వెటర్నరీ డాక్టర్స్?? పోస్టుమార్టం నిర్వహించారు. ఆవులను తరలిస్తున్న నలుగురు తమిళనాడు వాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

## అప్పు తీర్చలేక సెల్ఫీతో ఆత్మహత్య

**మేడ్చల్,మే29:** తీసుకున్న అప్పు చెల్లించలేక ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జీనోంవ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్(35) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 2023లో రూ.6 లక్షల అప్పు తీసుకున్నారు. అందులో ఆ వ్యక్తికి రూ.4.70 లక్షలు తిరిగి చెల్లించారు. మిగిలిన డబ్బులు చెల్లించాలని అప్పిచ్చిన వ్యక్తి ఒత్తిడి చేయటంతో బాధితుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తన బాధను ఫోన్ లో సెల్ఫీ వీడియో తీసి పాత ఇనుప సామాను దుకాణంలో దూలానికి నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## ఓట్ల లెక్కింపులో మందుస్తు జాగ్రత్తలు

### హింసకు తావులేకుండా చర్యలు

### రాష్ట్ర అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

**అమరావతి,మే29:** ఏపీలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి హింసాత్మక ఘటనలకూ తావులేకుండా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓట్ల లెక్కింపు పక్రియపై దిల్లీ నుంచి ఈసీ ఉన్నతాధికారులు పలుమార్లు సమీక్షలు నిర్వహిస్తున్నారు. సీఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టేలా కేంద్ర ఎన్నికల కమిషన్‌లోని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్ష చేపట్టారు. త్వరితగతిన కచ్చితమైన ఫలితాల ప్రకటనకు, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా ఇప్పటి వరకూ చేసిన ఏర్పాట్లపై దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన ఆరా తీశారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా, రాష్ట్ర పోలీసు నోడల్ అధికారి ఏడీజీ శంకబ్రత బాగ్చి సహా అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు హాజరయ్యారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఇతరులను అనుమతించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేశారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ సిస్టం, భద్రతా వ్యవస్థలో లోపాలు లేకుండా చూసుకోవాలని తేల్చి చెప్పారు. ఎలాంటి హింసాత్మక ఘటనలూ జరిగేందుకు వీల్లేదని ఎస్పీలను ఆదేశించారు. ప్రత్యేకించి పల్నాడు సహా రాయలసీమ జిల్లాల్లోని కొన్ని చోట్ల ఎన్నికల అనంతరం హింస చెలరేగిన నేపథ్యంలో తగిన జాగ్రత్తలుతీసుకోవాలని సూచించారు.

## ప్రజ్వల్ రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

**బెంగళరూరు,మే29:** అత్యాచారం కేసులో పలువురు మహిళలపై లైంగిక దాడి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను బెంగళూరులోని ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. ప్రజ్వల్ తరుపున న్యాయవాది అరుణ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది . ఈ పిటిషన్లపై అభ్యంతరాలను దాఖలు చేయాలని కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను కోర్టు కోరింది. కాగా ప్రజ్వల్‌ని బెంగళూరు విమానాశ్రయానికి రాగానే అరెస్టు చేస్తామని కర్ణాటక హోంమంత్రి జి పరమేశ్వర తెలిపారు. . జర్మనీలోని మ్యూనిచ్ నుంచిలట్ టికెట్ బుక్ చేసుకున్న ప్రజ్వల్ శుక్రవారం తెల్లవారుజామున బెంగళూరుకు చేరుకుంటారు. ప్రజ్వల్‌పై ఇప్పటి వరకు రెండు లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి. ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై సిట్ విచారణ జరుపుతోంది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com